ఆదర్శ శిఖరాలు

జి. వి. కృష్ణరావు

జాకోబిన్ పబ్లిషర్స్, తెనాలి.

CI

231

ఆదర్శ శిఖరాలు.

[నాటికలు]

Pr...
1676

జి. వి. కృష్ణరావు

[stamp]

జాకోబిన్ పబ్లికేషన్సు
తెనాలి

అన్ని హక్కులు రచయితవి

రూ పా యి

రినైసాన్సు ప్రింటర్స్ లిమిటెడ్, మద్రాసు

Mallikarjuna Rao
VADLAMUDI (P. O.)
GUNTUR DT.

ఆదర్శ శిఖరాలు

పాత్రలు

*

తాతయ్య
మహాదేవుడు
కేదారుడు
పరదేశి
రాజు
కంచుకి
శిల్పులు
వైతాళికులు

*

Guyadevara Mallikarjuna Rao
VADLAMUDI (P.O.)
GUNTUR DT.
1676

౧

జనులు తండోపతండాలుగా వెళ్లుతూవుంటారు. జయజయధ్వనులు, శివనామ సంకీర్తనలు వినిపిస్తూవుంటాయి. ఆ గంద్రగోళంలో "అయ్యో నా ఉత్తరీయం," "నా జంధ్యం," "అయ్యయ్యో, నా కాలు!" "ఓరే చిట్టీ," "నాబొక్కిసా!" "ఒసేవ్ ఎక్కడే!" అన్న కేకలు వినిపిస్తూవుంటాయి.

ప్రతిష్ఠ జరుగని దేవుడికి ప్రజ దణ్ణాలు పెడుతూవుంటుంది. జనానికి దూరాన గోపురశిఖరాలు మాత్రం కనిపిస్తాయి.

ఈ ఒత్తిడికి వెలుపల ఒకవృద్ధు, అతని శిష్యుడు, మరొక పరదేశి నడుస్తూవుంటారు. శిష్యుడు, పరదేశి కొంచెం ముందు వెళ్లుతూవుంటారు. ఈ ముగ్గురు వ్యక్తులకూ పింజవోసికట్టిన నీరుకావి దోవతులు. పైన ఉత్తరీయాలు. శిష్యుని ఉత్తరీయం కొంగున ఏదో వేలాడుతూవుంటుంది.

వృద్ధునికి పూర్తిగా చత్వారం. చేతిలో ఒకకర్ర మాత్రం ఉంటుంది. ఈ కర్ర టకటక కొట్టుకుంటూ, వంగిన నడుంతో వృద్ధు మెల్లగా నడుస్తూవుంటాడు.

తాతయ్య. బాబా, బాబా! (చూపు ఆనక ఎడమచెయ్యి కనుబొమల కడ్డుపెట్టుకొని అటూ ఇటూ చూస్తాడు.) బాబా, బాబా!

కేదారుడు. ఈ జనమంతా అక్కడికేనా?

పరదేశి. ఔను, ఆ దివ్యలోకానికే.

కేదారుడు. ఆ సృష్టి అంత లోకోత్తరంగా వుందా?

పరదేశి. ఏమో చూడటానికి ఈ చర్మ చక్షువులు చాల వంటున్నారు.

తాతయ్య. బాబా, బాబా!

కేదారుడు. ఓయ్!

తాతయ్య. పరుగెడుతున్న యీ లోకంలో ముసలివాళ్లు దేనికి? భగవాన్ ఇదంతా ఆట – కళ్లూ కాళ్లూ లేనివాళ్లతో ఆట!

కేదారుడు. (తాతయ్య దగ్గరకు వచ్చి చెయ్యి పట్టుకొని మారాం చేస్తూ) తాతయ్యా, తాతయ్యా! అంతకోపం దేనికి? మీ లాంటివారు ఉండబట్టే ఈలోకం పరిగెడుతూవుంది. కాళ్లు విరిగితే కట్లు కట్టించుకొంటూవుంది.

తాతయ్య. ఒరేయ్, ఈ మాటలు గుండెల్లోనుంచి వస్తున్నాయా?

కేదారుడు. (నవ్వుతూ) అబ్బే, మా తాతయ్యకు ఏమీ తెలీదు......... సరే కాని తాతయ్యా, మా అమ్మమ్మ నడుములు రోజు కెన్నిసార్లు విరిగేవి?

తాతయ్య. ఏమండోయ్, వింటున్నారుగా!

పరదేశి. ఏదో నవ్వుతున్నాడు లెండి. తాతదగ్గర కాకపోతే మనుమడు మరెక్కడ చనువు తీసుకొంటాడు?

తాతయ్య. నాయనా, ఇంకా ఎంత దూర ముంది!

కేదారుడు. ఆఁ, ఎంత, ఇంకా ఒక్క పరుగు.

తాతయ్య. పరుగా? (నిట్టూర్చి) ఏయ్ తాతా, ఇంకొక్క పరుగు. ఏదీ కానీ—ఒకటి, రెండు.

పరదేశి. నిజంగా పరుగెత్తరు గదా! దేవాలయం చూడకుండానే మధ్యలో పడిపోయేరు!

తాతయ్య. నాయనా, ఈ ఘటముందే – ఈ ఘటం ఓటి దనుకుంటున్నారేమో, కాదు.

కేదారుడు. (నవ్వుతూ) ఓటిదయితే, ఈ వయసులో, ఈ జనసమ్మర్దంలో ఇంతదూరం వస్తుందా?

తాతయ్య. నిజమేరా, బాబా! చూడు నువ్వేంతెత్తున్నా? రెండంగు

శాల ఆరు వీసాలు, అంతేనా ?

పరదేశి. (నవ్వుతూ). అదేమిటి, అలా అంటారు ? చత్వారమా, చమత్కారమా ?

తాతయ్య. వాడంతకన్నా ఎత్తు ఉన్నాడంటారా ? కొలవండి.

కేదారుడు. తాతయ్యా, నిజమే, నీకు నేను రెండు అంగుళాల ఆరు వీసాలే. అబద్ధం కాదు.

తాతయ్య. చూపులేనివాడు ఇక ఇక్కడికి దేనికి వస్తాడు ? ఏమి ఆనందిస్తాడు ?

కేదారుడు. ఆయన మాటలు నమ్మకండి. అసలు సంగతి మీకు తెలీదు. ఈ శిల్పసంపద చూడాలని ఆయన ఆరాటం.

తాతయ్య. నాయనా, చూస్తున్నావుగా ? కాళ్లులేనివాడు శిల్పకళను ఆనందిస్తాడా ? ఇది ఎక్కడన్నావుందా ?

పరదేశి. (కేదారుడితో)వారు చెప్పేది అబద్ధమంటారా ? ఈ వయసు మళ్లిన కాలంలో ఇంతదూరం వారు వస్తారా ?

తాతయ్య. అదీ, నూరేండ్లు బ్రతుకు నాయనా !

కేదారుడు. (నవ్వుతూ) నిజంచెప్పు తాతయ్యా ! నువ్వు బయలుదేరదీశావా ? నేను బయలుదేరదీశానా ? మనమిద్దరం అబద్ధమాడితే, మా అమ్మ అబద్ధం చెబుతుందీ ?

తాతయ్య. కన్నకడుపు ఏమి చెబుతుందిరా ?

కేదారుడు. మీ అమ్మాయి అబద్ధం చెబుతుందా ?

తాతయ్య. అవును, నిజమే. నేనే నిన్ను వెంటబెట్టుకొనివచ్చాను. సరేనా ?

కేదారుడు. నీతో వాదించి ఎవరు నెగ్గగలరు ?

తాతయ్య. నీవు నెగ్గుతున్నావు.

కేదారుడు. కేవలం మనమడిమీది ప్రేమ. నిజానికి వస్తే నీతో పోటీ చెయ్యగలనా ?

తాతయ్య. (మనమణ్ణి దగ్గరకు తీసుకొని తల నిమురుతూ) బాబా, మే మిద్దరం నీమీద ప్రాణాలుపెట్టుకొని బ్రతుకుతున్నాము. బ్రతక మంటావా, లేదంటావా?

కేదారుడు. తాతయ్యా, అలా మాట్లాడుతా వేం?

తాతయ్య. నాలుగు కాలాలపాటు బ్రతుకు. నీ వంశాన్ని, నీదేశాన్ని ఉద్ధరించు.

పరదేశి. అదేమిటి, అలా సెలవిస్తారు?

తాతయ్య. వీరశైవుడైన రాజు విగ్రహ ప్రతిష్ఠచేస్తూవున్నాడు. సిద్ధహస్తుడైన శిల్పి చేయిస్తూవున్నాడు. ఇది మాత్రం మరచిపోకు. ఆ పైని నీ యిష్టం.

కేదారుడు. అనవసరంగా మాట్లాడ నన్నాను. అమ్మకు మాట యిచ్చాను. గురుదేవునితో శపథం చేస్తూవున్నాను. నన్ను నమ్మలేవు?

తాతయ్య. నమ్మటం, నమ్మకపోవటం కాదు. దీక్షితుల మనస్సు అలా అనిపిస్తుంది. అన్నట్టు ఒక కథ జ్ఞాపకం వస్తున్నది.

పరదేశి. చెప్పండి వింటాము.

తాతయ్య. పూర్వం ఒక శిల్పాచార్యుడు ఉండేవాడు.

కేదారుడు. ఎప్పటి సంగతి?

తాతయ్య. ఎప్పుడో చెప్పలేను. ఈ ముసలివాడికి అంత జ్ఞాపకమా?

పరదేశి. ఒక శిల్పాచార్యుడూ—అయితే?

తాతయ్యా. ఆయనదగ్గర కూతురు, శిష్యుడూ శిల్పం చెప్పకొంటూ వుండేవారు.

కేదారుడు. ఆ ఆచార్యులు మీ రే నట్లుందే!

తాతయ్య. అంతా తెలిసిం తరువాత నేను చెప్పటం దేనికి?

కేదారుడు. నాకు తెలీదు తాతయ్యా. చెప్పు—చెప్పవూ? మా తాతయ్య చాల మంచివాడు. ఏమండోయ్, మా తాతయ్య చాల మంచివాడు. నేనే బలవంతంచేసి మా తాతయ్యను ఇక్కడికి లాక్కువచ్చాను.

నిజం చెప్పానుగా! ఇక చెప్పు తాతయ్యా! మీరు ఊఁ కొడుతూ వుండండి.

తాతయ్య. ఉండరా గడుగ్గాయా! తాతకే దగ్గులు నేర్పాలంటావు.

పరదేశి. మీరు చెప్పండి!

తాతయ్య. సరే కూతురు, శిష్యుడూ శిల్పంలో ఆరితేరారు.

కేదారుడు. వారిద్దరికీ చూపులు కలిశాయి.

తాతయ్య. చూపులు కాదు—మనస్సులోయ్, మనస్సులు!

కేదారుడు. ఇప్పుడు మా అమ్మమ్మ దగ్గరుంటేనా?

పరదేశి. చెప్పనీండీ! తరువాత?

తాతయ్య. వరుడు కట్నం కావాలన్నాడు. ఆమె హృదయాన్ని కరిగించి పోసిన అర్ధనారీశ్వర విగ్రహాన్ని ఇమ్మన్నాడు. అది నాహృదయమే కదా అంది వధువు. దాన్నిబద్దలు చెయ్యటానికి ఇష్టముంటే పెండ్లాడుతానన్నాడు వరుడు. ఆమె త్రొక్కిసలాడుతూవుంది.

కేదారుడు. చివరకి ఏమైంది?

తాతయ్య. అర్ధనారీశ్వరుడు ముక్క చెక్కలయ్యాడు. వారికి పెండ్లి అయింది.

పరదేశి. ఎంతటిప్రేమ! ఆత్యాగాన్ని ఎవరు చేయగలరు?

కేదారుడు. లోకానికి ఒక అపూర్వ సందేశాన్ని ఇవ్వటానికి హృదయాన్ని కరిగించిపోసిన విగ్రహాన్ని ఒకరి కివ్వటానికి ఏమి అధికారముంది? అమె మాత్రం ఎంతవరకు సక్రమంగా ప్రవర్తించింది? వారి అనురాగం ఎంతదైనా కావచ్చును. కాని, లోకాన్ని దోచుకోటానికి వారికి అధికారంలేదు. ఆమె ఇవ్వటానికీ, అతడు భగ్నం చెయ్యటానికీ అధికార మెక్కడిది?

తాతయ్య. సాంతం విను.

కేదారుడు. కేవలం అన్యాయం.

పరదేశి. చెప్పండి!

తాతయ్య. ఆదంపతుల ప్రణయం మొగ్గ తొడిగింది. ప్రసవఘడియలు సమీపించాయి. శిశువు శీర్షోదయం కాగానే బయటికి నిమ్మకాయ వేయ వలసిం దని మంత్రసానికి ఆజ్ఞ. ఆమె వేసింది. కాని కాయ మండిగానికి తగిలి లోపలనే పడ్డది. పరిచర్యలలో మగ్నమైఉన్న మంత్రసాని తరువాత ఎప్పుడుచూచిందో, మళ్లీ దాన్ని బయటికి వేసింది. వాకిట్లో తాటాకు గంటం పట్టుకొని కూర్చున్న శిల్పి ఒళ్లోపడ్డది.

కేదారుడు. ఇంకేం, మీనమేషాలు లెక్కపెట్టాడు !

పరదేశి. ఏమి జరిగింది ?

తాతయ్య. జారిణీపుత్రు డని తేలింది. మనస్సు చివుక్కుమంది. శిల్పిని కాళ్లు ఎక్కడికో చేరవేశాయి.

కేదారుడు. కాళ్లు చేరవేసినచోటికి శిల్పి వెళ్లాడు. వహ్వా ఎంత బాగుంది !

పరదేశి. ఎంతపని జరిగింది!

కేదారుడు. (కోపంతో) నే నంతమూర్ఖుణ్ణి కాదు. ఇక నీవు నిశ్చింతగా ఉండవచ్చును.

తాతయ్య. అయితే శాస్త్రాన్ని కాదంటావా?

కేదారుడు. శాస్త్రం, శాస్త్రం! శాస్త్రం ఎక్కణుంచి పుట్టింది. (పర దేశితో) కాస్త తేడాతో ఈ విపరీతం జరిగింది. ఈ తేడానుగూడ గమనించలేని శాస్త్రం సమగ్ర మౌతుందీ? ఆమె ఎంత కనిడికోతలకు ఒప్పుకొని ఎంతగా ప్రేమించింది? అతగాడికి తెలుసే. అనుభవిం చాడే. అలాంటివాడు అసమగ్రశాస్త్రానికి ప్రాధాన్య మిచ్చి ఏమి చేశాడు... నాకు సాంమాజిక అనుభూతే బలీయసి. గురుదేవా, ఏమం టావు ?

తాతయ్య. ఏదో పుక్కిటి పురాణం చెబుతూవుంటే అంత వుద్రేకం దేనికి బాబా!... కాని ఇదిమాత్రం జ్ఞాపక ముంచుకో. అంతకన్నా యీ వృద్ధు... శిష్యునికి ఇక చెప్పవలసింది—

కేదారుడు. అదేమి తాతయ్యా...కళ్లు చెమ్మగిల్లుతున్నాయ్ ?

తాతయ్య. బాబా, ముసలివాణ్ణికదా...ఏది వచ్చినా అలా పట్టలేకుండా వస్తుంది. (మనుమణ్ణి దగ్గరకు లాక్కొని తల నిమురుతూ ఆకాశంలోకి చూస్తూవుంటాడు.)

కేదారుడు. కాదు, కాదు. ఏదో వుంది. మా గురుదేవుకు సామాన్య మానవుడు కాడు... తాతయ్యా, చెప్పవూ ?

తాతయ్య. ఇలాంటి కథను చెప్పక ఒకకొడుకును కోల్పోయాను. అది జ్ఞాపకం వచ్చి గుండె నీరయి పోతూవుంది.

కేదారుడు. మా అమ్మ ఎప్పుడూ చెప్పలేదే.

పరదేశి. ఇదిగో ప్రాకారగోపురం...ఎందరు శిల్పులు ఎన్నేండ్లు తపస్సు చేశారో!

కేదారుడు. తాతయ్యా, తాతయ్యా!

తాతయ్య. ఏమిటి బాబా!

కేదారుడు. ఇదిగో (తాతయ్యను ద్వారందగ్గరకు తీసుకువెళ్లి ధ్యానముద్రలోవున్న నారదునివిగ్రహంమీద చేతిని మోపిస్తాడు. అతడు ఆపాదమస్తకం తడివి, విగ్రహముఖాన్ని మాటిమాటికి చాలసెమ్మదిగా వణుకుతూ, వణుకుతూ, తడువుతూ, మనుమడి ముఖంలోకి రెండు సెకండ్లుచూచి)

తాతయ్య. బాబా, జన్మ తరించింది, ముకుళితనేత్రమైన యీ నారద ముఖంలో ఎంతటి దివ్యమందహాసాన్ని చిత్రించాడో చూచావా ? శిల్పమంటే ఇదీ శిల్పం.

పరదేశి. విచిత్రంగా వుంది. స్పర్శమాత్రంతోనే ప్రతిమా సౌందర్యాన్ని అనుభవిస్తున్నారే!

తాతయ్య. నాదేముంది నాయనా ! ఆశిల్పి లోకోత్తరుడు. (కంఠంలో గాద్గద్యం మోగుతుంది. మనుమడితో) బాబా, నాకాళ్లు వణికిపోతున్నాయి...మనస్సు పరిపరివిధాల పరిగెడుతూవుంది.

కేదారుడు. ఏం తాతయ్యా?

తాతయ్య. (తడబడుతూ) ఈశిల్పం ఎప్పుడో కొంతకాలం నాచేతిలో మెలిగినట్లుగా ... సరిగా చెప్పలేను బాబా, ఈఖత్తు ఎక్కడో ఎప్పుడో... ఈజన్మలో నేనా ? చెప్పలేను బాబా !

కేదారుడు. ఏమిటి తాతయ్యా?

తాతయ్య. నాగుండె ఎందుకో కొట్టుకొంటూవుంది. మనస్సు మనస్సులో లేకుండా పోతూవుంది. మనం తిరిగి పోతే ?

కేదారుడు. ఎందు కంత కల్లోలపడుతున్నావు తాతయ్యా !

తాతయ్య. బాబా, లేదు. ఎందుకో భయం కలుగుతూవుంది. మనం ఎందుకు తిరిగి పోగూడదు ?

పరదేశి. ఇంతదూరం వచ్చి ఈశిల్పాన్ని చూడకుండా తిరిగిపోతారా ?

తాతయ్య. (మనమడితో) మీ అమ్మకు వాగ్దాన మిచ్చాను. నీ కొడుకును మళ్లీ నీ కప్పగిస్తా నన్నాను.

కేదారుడు. (నవ్వుతూ) అంతేగదా! మా తాతయ్యను ఎవ్వడు ఓడించ గలడు? విశ్వకర్మ వచ్చినా నమస్కరించి పోవలసిందే.

తాతయ్య. ఆ అహంకారమే పనికి రాదంటాను. బాబా నా హృదయం ఏదో అశుభాన్ని శంకిస్తూవుంది. పవనవీచికల్లో ఏదో విపత్తుపలుకుతూ వుంది.

కేదారుడు. కాచివడపోసినమీరే అలా అంటే, ఎవ రేమి చెపుతారు?

తాతయ్య. తొందరపడ నని వాగ్దానం చెయ్యి బాబా !

కేదారుడు. ఇదివరకే చేశానుగా...

తాతయ్య. (మనుమడి శిరస్సునిమురుతూ) మళ్లీ.

కేదారుడు. అలాగే (తాతపాదాలు స్పృశించి) తొందరపడను.

పరదేశి. ఇదంతా ఏమిటి ? నేను ఏ లోకంలో ఉన్నాను ?

తాతయ్య. ఇక్కడ ఎవరికో, శృంగభంగం తప్పదు. బాబా నేను రాలేను. ముసలివాణ్ణి దయదలచి ఈ వార్ధకాన్నిజనసమ్మర్దం లేని

చోటికి చేరవేయి బాబు!

కేదారుడు. అదిగో, అదిగో! చంద్రశేఖరుని విగ్రహం మల్లేవుంది. దాన్నే ప్రతిష్ఠించుతారు కాబోలు! చూచిం తరువాత బయటికి వెళ్లుదాము. (తాతయ్య చెయ్యిపట్టుకొంటాడు.)

తాతయ్య. (నిట్టూర్చి) పోవలసిందేనా?

పరదేశి. ఇంత లెక్క పడివచ్చారు కదా?

[అందరూ ముందుకు నడుస్తారు]

పరదేశి. శిల్పి ధన్యుడు.

కేదారుడు. (ఆవేగంతో) తాతయ్యా, తాతయ్యా! (తాతయ్య చెయ్యి ఒక్కసారిగా కుదుపుతాడు)

తాతయ్య. (ఉగ్రుడైపోయి) ఛీ, నోరుముయ్!

కేదారుడు. (ధైర్యంతో) తాతయ్యా!

తాతయ్య. ఇంతకు ముందేమన్నావ్? ఇందుకేనా నన్నిక్కడకు తీసుకొచ్చింది? నీ వాగ్దాన మేమైంది?

పరదేశి. ఎందుకండి అంతకోపం? ఆయన ఏమిచేశాడు?

తాతయ్య. నాయనా, మావాడి సంగతి మీకు తెలీదు. లోకాలన్నిటినీ తన పాదాక్రాంతం చేసుకోవాలని వాడికోరిక. సప్తగ్రహాలు ఇక వాడిచుట్టూ తిరగాలి. శిల్పుల తలలు నరికించి వాడిమెళ్లో వేసుకోవాలి!

కేదారుడు. (మొండికెత్తి) నా గురువులు అంత సంస్కారహీనులు కాదు.

పరదేశి. అంతలోనే మీరు నెయ్యిపోసిన అగ్నికుండ మాతున్నా రేమిటి?

తాతయ్య. నాయనా, నీవు శిల్పివి కావచ్చును. అన్ని మర్మాలు తెలిసి ఉండవచ్చును. అంతమాత్రాన నే కన్నులు నెత్తికి రాగూడదు. అందుకేనా నీ శాస్త్రాన్నీ, కళనూ అభ్యసించింది? కాదు బాబా, కాదు. లోకాన్ని ప్రబుద్ధం చెయ్యాలి. తద్వారా జన్మను తరింప జేసుకోవాలి.

పరదేశి. నే నా భాగ్యానికి నోచుకోలేదు.

కేదారుడు. లోకం పల్లకీ అయి నన్ను మోయాలని కోరటం లేదు.

తాతయ్య. కాక మరే మంటావు? కీర్తికండూతికోసం ఒక శిల్పి కపాలాన్ని మెడకు కట్టుకొంటావా?

పరదేశి. మీరు తెలుగు మాట్లాడుతున్నారా?

కేదారుడు. నా స్వార్థం కోసం నేనేమీ చెయ్యటంలేదు, చెయ్యను. కాని......

తాతయ్య. అందుకే ఇక్కడకు రావద్దన్నది. అందుకే యీ వయస్సున ఇంత దూరం పడివచ్చింది. నీ మాత్రం ఆ లోకోత్తరశిల్పికి తెలియ దంటావా?

కేదారుడు. కాదంటున్నానా తాతయ్యా! శాస్త్రం అపారం. నేను పారంగతుణ్ణని ఎవడు చెప్పకొంటాడు? కాని, ఆ—

తాతయ్య. అదే అనవద్దంటున్నాను. ఆ అహంకారమే పనికిరాదంటు న్నాను. దోషమంటే ఏమిటి? నిర్దుష్టమైన వస్తువును ప్రపంచంలో చూపించు. క్రిందూ మీదూ తెలియటంలేదు. ఔను, నిన్నంటే ప్రయో జన మేముందిలే! ఆ వయస్సుని అనాలి.

కేదారుడు. తాతయ్యా, ఎందు కంత వలపక్షం. ఆ విగ్రహాన్ని ఆచేతితో తాకిచూస్తే మీకే తెలుస్తుంది.

తాతయ్య. (క్రుంగిపోయి) బాబా, నాకు ఏమీ తెలీదు. వయస్సుతో పాటు మతిగూడ మళ్లిపోయింది. చేతులు వణకిపోతున్నాయి. ఈపాప మంతా నాకు దేనికి? నా తర మేదో వెళ్లిపోయింది. లోకం నన్ను అతిక్రమించి పోయింది. ఒకప్పుడీ లోకం ప్రాధేయపడింది. పాదాలు పట్టుకొన్నది. ఎందుకు ఆ గొడవ...ఒక మూల కూర్చుని కృష్ణా, రామా, అనుకోవలసిన నన్ను రంగలోకి ఎందుకీడుస్తావు? నేను ఆడాలేను, పాడాలేను. నన్ను ఇంటికి చేర్చు. తాతను మనమడు బాగా చూచా డంటారు.

కేదారుడు. తాతయ్యా, ఎందుకంత కోపం. కాస్త దయవుంచి ఆవిగ్రహాన్ని చూడు.

తాతయ్య. నాకేమీ తెలీదు. శిల్పమంటే ఏమిటి బాబా? అజ్ఞానిని.

పరదేశి. ఎవరో యిద్దరు మీవంక ఊరికే చూస్తున్నారు. రాజుతో చెబుతారేమో!

కేదారుడు. (వినిపించుకోక) ఒకసారి చూడండి. తరువాత మీ రేమన్నా పడతాను.

తాతయ్య. (కఠినంగా) ఇక్కడ ఒక్క-క్షణం ఉండవద్దు. వెళ్లుదాం పద.

కేదారుడు. తాతయ్యా, లోకానికీ, శిల్పానికీ అపకారం చేస్తావా?

తాతయ్య. అందుకని ఒక లోకోత్తర శిల్పిప్రాణాలు తియ్యమంటావా? ఆ వుసురు నన్ను పోసుకోమంటావా? నా చేతకాదు. నావల్లకాదు. కేవలం నేను శాకాహారిని—మానవుణ్ణి.

కేదారుడు. నీ శిల్ప దీక్ష, శాస్త్రాభిమానం ఏమయ్యాయి తాతయ్యా! ఏ అణుమాత్రం దోషమున్నా, శాస్త్రాన్ని ఏ మాత్రం ఉల్లంఘించినా సహించేవాడివి కాదే. నేడెలా సహిస్తున్నావు? మేరుపర్వతం లాగా నిలిచి పోరాడవలసిన యీ సమయంలో ఇలా జారిపోవటం ధర్మమా!

తాతయ్య. నీ కిదివరకే చెప్పాను. శాస్త్రాన్ని పూర్తిగా అభ్యసించిన తరువాత శిల్పి స్వతంత్రుడు. అత డేమి చేసినా సొగసుంది-ఇంతకూ నా శిష్యుణ్ణి ఇందరిలో అవమానపరచ మంటావా? ఆ అవమానం నాది కాదా?

కేదారుడు. (ఆశ్చర్యంతో) ఈ శిల్పి నీ శిష్యుడా?

తాతయ్య. నేను ఖచ్చితంగా చెప్పలేను. కాని యీహస్తాన్ని ఎక్కడో, ఏ జన్మలోనో దిద్దాను. బాబా, నన్నెందుకు ఏడిపిస్తావు? ఈ వార్ధకంలోకూడ మనశ్శాంతికి నోచుకోలేదా? నీ తండ్రి కోసం ఈ రోజుకూ ఏడుస్తూనే వున్నాను. మరొక అప్పుణ్ణికూడ నా కళ్ల ఎదుట అవమానించి నన్నెందుకు ఏడిపిస్తావు?

కేదారుడు. నీలాంటి ధర్మజ్ఞుడే అలా అంటే ఏమి చేసేది? తాతయ్యా ఒకటి మాత్రం మరచి పోకు. ఈ దేవాలయానికి కోట్లకొలది ధనం వ్యయ మౌతూవుంది.

తాతయ్య. అయితే ?

కేదారుండు. ఇదంతా ప్రజలది. నెత్తురోడ్చి సంపాదించినది. ఒక్క చిల్లిగవ్వకూడ రాజుది కాదు. ఇన్నికోట్లు వ్యయించిన ఫలం ప్రజలకు చెందాలి. ఈదేవాలయం వారిలో శాశ్వతంగా భక్తిభావాన్ని రేకత్తిస్తూ వుండాలి.

తాతయ్య. ప్రపంచంలో అన్నీ శాశ్వతమే !

కేదారుడు. నీతో నేను వాదించలేను. ఏది ఎలా వున్నా కొంత కాలం ఈ దేవాలయం నిలవాలి. ప్రజల కష్టార్జితానికి ఫల ముండాలి. ప్రజలది పాపపు సొమ్ము కాదు. గంగలో కలపాటానికి వీలులేదు.

తాతయ్య. బాబా, నిన్ను చూచి నవ్వనా ? ఏడ్వనా ? ప్రపంచంలో ఎన్ని మహత్తర కృతులు నశించాయి ? ఎందుకూ కొరగాని కృతు లెన్ని కేలుమోడ్పు లందుకొంటున్నాయి ? గుణదోషాల దారి గుణదోషాలది. లోకం దారి లోకానిది. పెద్దవాణ్ణో, చిన్నవాణ్ణో చెబుతున్నాను. పద. బాబా, నా మాట కాస్త చెవిని బెట్టు. మళ్లీ నీ కాళ్లచేతులకు అడ్డం రాను.

కేదారుడు. తాతయ్యా, ఈ ప్రజాద్రోహానికీ, శిల్పద్రోహానికీ ఒడిగట్టుతావా ?

తాతయ్య. లోకవ్యవహారం నీకు తెలీదు. నిన్నకాక మొన్ననే కళ్లు విప్పావు. మాత్సర్యం ఎలా నడుపుతుందో, తనకత్తి కెదురు తగిలితే రాజుల చిత్తవృత్తి ఎలా వుంటుందో నీకేమి తెలుసు ? ఎప్పుడు చూచావు కనక ? నా మాట విని వెళ్లుదాం పద. నన్ను ఏడిపించకు. మీ అమ్మసంగతైనా ఆలోచించు.

కేదారుడు. నీవంటి శిల్పకోవిదుడు ధర్మిష్ఠి, ఇలా కావటం శోచనీయం.

దేశ దౌర్భాగ్యం. ఇదే నమస్కారం. నా ధర్మాన్ని పరిత్యజించలేను. తాతయ్యా నన్నాశీర్వదించు.

తాతయ్య. నేను ముసలివాణ్ణి-మాటలు తడబడుతున్నాయి. ఆశీర్వదించనా? విచిత్రం, ఈ మానవ జీవితం విచిత్రం. ఎన్ని పోకళ్లు పోతుంది? కీర్తికోసం చేయరాని పనులను చేస్తుంది, ధర్మ మంటుంది. అధికారంకోసం రక్తాన్ని ప్రవహింపజేస్తుంది, అహింస అంటుంది. ఎప్పుడూ ఈ ప్రాణి మాయావాగురలలో తప్ప బయట బ్రతుకలేదు. బాబా పో—నీ గురుదేవుల చేతులు నరికించు! (ముఖం తిప్పుకొని) భగవాన్ నీ శిక్ష యిదా! (వెళ్లుతూవుంటాడు.)

పరదేశి. కళ్లుకనపడని ఆ వృద్ధులు వెళ్లిపోతున్నారు.

వైతాళికులకంఠం. శ్రీమన్మహామండల రాజాధిరాజ రాజపరమేశ్వర, విజయీభవ! అభ్యస్త సర్వదర్శన కళాప్రాభవా, విజయీభవ!

కేదారుడు. (పరదేశితో పెద్దగా) మా తాతయ్యను కాస్తచూస్తూ వుండండి. నేను త్వరగానే వస్తాను. (కంచుకి ప్రవేశిస్తాడు)

కంచుకి. మహారాజుల ఆజ్ఞ.

కేదారుడు. ఏమని?

కంచుకి. తమ్ము ఆస్థానానికి తోడ్కొని రమ్మని.

కేదారుడు. మేము ఆస్థానపోషితులము కాదే?

కంచుకి. పోషితులు కాదు. ఆహూయమానులు. దయచేయండి. ఇటు.........

[ఇద్దరూ వెళ్లిపోతారు]

౨

రాజు. ప్రతిష్ఠ రేపు కాబోలు!

జక్కన. కాదు ప్రభూ!

రాజు. అయిన మరి?

జక్కన. ప్రతిష్ఠ నేడే జరిగితీరుతుంది. ఏలినవారి సంకల్పం అన్యథా జరుగజాలదు.

రాజు. విచిత్రం. చాలూమూలా తెలియని కుర్రకుంక ఏదో అన్నాడని రగడ జరగాలా?

జక్కన. దేవరవారు అలా సెలవిస్తే నేనుచెప్పగలిగినది లేదు. దేవాలయ నిర్మాణం అంత సామాన్యం కాదు. ప్రభువులు అంత తొందర పడగూడదు.

రాజు. నిమిష నిమిషానికి మీనమేషాలు లెక్క పెడుతూ కూర్చుంటే యీ ప్రపంచంలో ఒక్కటీ మనం చెయ్యలేము. నీ క్రిందపనిచేసే శిల్పులు ఎంత ఘోషించారో తెలుసునా?

జక్కన. ఏలినవారు ఏమి సెలవిస్తున్నారు?

రాజు. శిల్పులు అలాంటి అగ్నిహోత్రంలో వేగలేమన్నారు. అయినా ఏమి ఆజ్ఞాపించానో తెలుసునా? ఆయన ఆజ్ఞ నా ఆజ్ఞ అన్నాను.

జక్కన. ధన్యుడను ప్రభూ!

రాజు. ఈ ప్రతిష్ఠాకాలాన్ని దాటవెయ్యవు కదా?

జక్కన. లేదు ప్రభూ!

రాజు. ఈ కుర్రకుంకతో మరి?

జక్కన. ప్రజలలో భక్తిభావాన్ని నిక్షేపించటమే కదా, ఏలినవారి సంకల్పం?

రాజు. అవును.

జక్కన. ఈ కుర్రవాడు నేడు ఇద్దరితో దోషం ముందన్నాడు. అసలు అది దోషం కాకపోవచ్చును. కాని ఆ అనుమానం నానాటికీ ప్రజలలో వ్యాపించవచ్చును. ఒకసారి మనసులో గిలి బయలుదేరిం తరువాత ఎంతపని అయినా చేస్తుంది. అందువల్ల భక్తిభావం శాశ్వతంగా నిలవ టానికి శిల్పి ప్రయత్నించాలి. తాను నిర్దేశించిన సంస్కారం లోకంలో వ్యాపింపజెయ్యటం శిల్పి ధర్మం. అలా చెయ్యగలిగిననాడే అతడు శిల్పి, కళోపాసకుడు అవుతున్నాడు.

రాజు. ఇంతకూ వాదము తప్పదన్నమాట.

కంచుకి. జయము, జయము మహారాజా! వారిని ఇక్కడకు కొని వచ్చాను. ప్రవేశపెట్టవచ్చునా?

రాజు. (జక్కన వంక ఆందోళనతో చూస్తాడు.)

జక్కన. అవశ్యం. ఆస్థాన శిల్పులనుకూడ పిల్చుకొనిరా.

కంచుకి. చిత్తం (వెళ్లుతాడు)

రాజు. ఆచార్యా శిల్పులు దేనికి?

జక్కన. న్యాయవిచారణకు, శాస్త్రార్థం చేస్తూవుంటే విని తెలుసు కొనటానికి.

రాజు. విచిత్ర వ్యక్తివయ్యా!

కంచుకి. (ప్రవేశించి) మహారాజా! వీరే శిల్పులు.

శిల్పి. విజయీ భవ! ఆచార్యవరేణ్యా నమస్కారం.

కేదారుడు. (రాజును ఆశీర్వదిస్తూ) సంకల్ప సిద్ధిరస్తు!

[శిల్పులు అంతా ఉచితస్థానాలకు చేరుతారు]

రాజు. వారే శిల్పాచార్యులు —వీరు శిల్పులు.

కేదారుడు. చిత్తం.

రాజు. కూర్చోండి. ఆచార్యా కార్యక్రమ మేమన్నా ఉన్నదా?

జక్కన. అవును ప్రభూ! ఇప్పుడే వీరికి విన్నవిస్తాను. (శిల్పులతో)

పూజ్యులారా, మన మిన్నాళ్లనుంచి సాగిస్తూవచ్చిన కృతిలో దోషము న్నదట. (కేదారునితో) ఈ అభియోగం మీదే కదా?

కేదారుడు. అవును.

జక్కన. రాజా, తమరు ఇక విచారణ ప్రారంభించవచ్చును.

శిల్పులు. దోషమా (రిచ్చపోతారు.)

రాజు. (కేదారునితో) వత్సా!

శిల్పులు. ప్రభూ!

రాజు. ఎవరది మాట్లాడునది! (నిశ్శబ్దం) దోషమున్నదా, లేక భ్రాంతి పడ్డావా?

కేదారుడు. భ్రాంతికాదు. కేవలం దోషం.

రాజు. నీ కులగోత్రాలు?

కేదారుడు. చెప్పజాలను.

జక్కన. పోనిండు ప్రభూ, తన కులగోత్రాలను తాను చెప్పకో గూడదు. అది ధర్మదూషితం.

రాజు. ఎవరి ఆస్థానంలో ఉంటున్నావు?

కేదారుడు. స్వతంత్రుడను.

రాజు. అయిన ఇచట విచారణకు తావులేదు.

కేదారుడు. అన్యాయం ప్రభూ! కులగోత్రాలు లేనంతమాత్రాన, పేరు ప్రతిష్ఠలు లేనంతమాత్రాన ఒకవ్యక్తికి శాస్త్రగంధ ముండదనీ, కలా ధర్మము తెలియదనీ, నిర్ణయించటం అన్యాయం. కులగోత్రాలు లేనివా రెందరు విఖ్యాతశాస్త్రకారులు, శిల్పులు, కవులు లేరు?

రాజు. సుప్రసిద్ధ శిల్పాచార్యులతో అనామకులు వాదభిక్ష కోరటానికి వీలులేదు. ఇది మా ఆస్థానగౌరవానికి భంగం.

కేదారుడు. మీ ఆస్థానంలో చేరకముందు మీ శిల్పాచార్యుల స్థితిగతు లడుగవచ్చునా?

రాజు. ఆస్థాన శిల్పులతో అనామకుడుగా ఉండి కయ్యానికి కాలు

తప్పలేదు. ఆస్థానం అతని శిల్పనై పుణ్యాన్ని పరిశీలించి స్థానమిచ్చింది.
కేదారుడు. ప్రభూ తమ ఆస్థానపదవినికాని, అర్థాన్నికాని ఆశించుట లేదు. సమాజంలో నాబాధ్యతను నిర్వహించటంకోసం వచ్చాను. నావంటివాడు మీ శిల్పాచార్యులను వాదభిక్షను కోరగూడదా ?
జక్కన. ప్రభూ!
రాజు. శిల్పాచార్య, ఆగు. మాఆస్థానానికి ఒక గౌరవం ఉన్నది. దానికి ఎవరూ భిన్నంగా నడవటానికి వీలులేదు.
కేదారుడు. అయిన నన్ను రప్పించుట దేనికి.
రాజు. క్షమాపణ చెప్పించుటకు.
కేదారుడు. చెప్పకపోయిన ?
రాజు. (ఇలాంటి సమాధానం తనకు చెబుతాడని అనుకోక రిచ్చపోయి) ఏమన్నావ్ ?
కేదారుడు. చెయ్యని తప్పుకు క్షమాపణ కోరలేను.
రాజు. ఈచర్య.
కేదారుడు. శిల్పిధర్మం.
జక్కన. ప్రభూ, కాలం గడచి పోతూవుంది.
రాజు. నీ చర్యకు అర్థమేమో తెలుసునా ?
కేదారుడు. విధి నిర్వహణం.
రాజు. కాదు ప్రభుతిరస్కారం.
కేదారుడు. ధర్మవిరోధి అయితే అంతే.
జక్కన. వత్సా, కార్యార్థి పద్ధతి అదికాదు.
కేదారుడు. ప్రతివాదికి భయపడి బుజ్జగించటం పద్ధతికాబోలు !
రాజు. శిక్షాపాత్రుడ వౌతున్నావు.
కేదారుడు. ఈ ద్రోహంకంటే శిక్షే మేలు.
రాజు. చెప్పి ప్రయోజనం లేదు. మా ఆస్థాన గౌరవరక్షణకు ఒకటే దారి కనిపిస్తూవుంది. దీనికి అంగీకరిస్తేనే మా శిల్పులతో వాదించ

టానికి వీలవుతుంది.

కేదారుడు. ఏమని సెలవు?

రాజు. ఈ వాదంలో ఓడితివా ఆ శిరస్సు నీది కాదు.

కేదారుడు. (ఉత్సాహంతో) ధన్యోఽస్మి.

జక్కన. ధర్మం కాదు ప్రభూ!

రాజు. మా శిల్పి ఓడిపోతే రెండు చేతులు పోతాయి.

కేదారుడు. అన్యాయం.

శిల్పులు. ఇందులో అన్యాయం ఏమి ఉంది.

కేదారుడు. మీ శిల్పి చేతులు పోతే ఎంత నరక యాతన పొందుతాడో తెలుసునా? హృదయము పొంగి స్రవించే కలావాహినికి కట్టలు వేయ లేని మొండి చేతులతో క్రుంగి పోతాడు. నే నంటేనో ఒక్కసారిగా యీతల పోతుంది. మళ్లీ దిగు లుండదు. సృష్టించాలన్న సంకల్ప నా, ఆవేదనా నిరర్థకత ఏవీ వుండవు.

రాజు. అతడు వయోధికుడు. మా తీర్పు సర్వథా సమంజసమే.

జక్కన. మాకు కాలం అతిక్రమిస్తూవుంది. ఏమని మీ వాదన.

కేదారుడు. మీకృతిలో దోషముంది.

జక్కన. పరిశీలించారా?

కేదారుడు. అవును ఒక దోష ముంది.

జక్కన. లేదు. రెండు దోషాలుండాలి. మళ్లీ వెళ్లి పరిశీలిస్తారా?

శిల్పులు. రెండుదోషాలా? ఆచార్యులకు తెలుసునన్నమాట!

రాజు. అయిన మరి యీ వాదన దేనికి?

కేదారుడు. (ఒకప్రక్క కోపము, మరొకప్రక్కన ఆశ్చర్యము) నాకు తెలిసినంతవరకు ఒకటే దోషం కనిపించింది. అలాంటిదాన్ని మీ వంటి ఆచార్యులు ఉపేక్షించదగింది కాదు. వెంటనే సవరించండి.

శిల్పులు. విచిత్రంగా వుంది.

జక్కన. ఓటమి అంగీకరిస్తున్నారా?

కేదారుడు. ఓటమా—దీనిని ఓటమి అంటారా ప్రభూ ?

జక్కన. సరే దోషమంటే ఏమిటి ?

కేదారుడు. మీరు ఏనిర్వచనం ప్రకారం రెండుదోషా లున్నవన్నారు.

జక్కన. ముందు మీరేకదా దోషమని ఉద్ఘాటించినది.

కేదారుడు. దోషమనేది ఒకప్రత్యేక పదార్థంగాలేదు. కేవలం దేశకాల పాత్ర నిర్ణీతమైన అనుభూతిని, శాస్త్రాన్నీ అధిగమించి నిర్దిష్టప్రయోజనానికి విఘ్నం కలిగించే దాన్ని దోషమంటారు.

జక్కన. అయితే శాస్త్రాలన్నీ చదువుకొన్నారా ?

కేదారుడు. (ఎత్తిపొడుస్తున్నట్టుగా భావించి) అబ్బే భూగర్భ వాస్తు శిల్పశాస్త్రాలు, షడ్దర్శనాలు, నాట్య శాస్త్రం మాకు అచుంబిత విషయాలు.

శిల్పులు. (ఒండొరులతో) శిల్పానికీ. నాట్య శాస్త్రానికీ సంబంధమేమిటి ?

కంచుకి. జయము మహారాజా ! ప్రతిష్ఠాసమయం సమీపిస్తూవుందట. పురోహితులు—

రాజు. ఆచార్యా !

జక్కన. చిత్తం ప్రభూ (కేదారునితో) ఇంతకూ ఏ దోషమున్నదంటావు ?

కేదారుడు. మీకు వాదం కావాలా ? లేక దోషంకావాలా.

కంచుకి. మహారాజా ! ఎవరో మూడుకాళ్లముసలి ఏలినవారి దర్శనం కోరుతున్నాడు.

రాజు. ముసలీముతుకకు ఇప్పుడు దర్శనం వీలులేదు.

కంచుకి. (జంకుతూ) కేదారకుమారుని చూడాలని కోరుతున్నారు.

జక్కన. వారికి తొందరపాటు కావాలేమో ప్రభూ ?

కేదారుడు. మీరు పెద్దలు కావచ్చును. మీ మాటలు మాత్రం పసిపిల్లవాడి మాటలులాగా ఉన్నాయి.

రాజు. కాలం అతిక్రమించి పోతూవుంది. (లోపలినుండి ఘంటారావం వినిపిస్తుంది. మధ్యమధ్య మంత్రాలు వినిపిస్తూవుంటాయి.) అదిగో ముహూర్త మాసన్న మౌతూవుంది.

జక్కన. ఇంతకూ దోష మేమో చెప్పలేదు. ఇప్పటికైనా మించి పోయినది లేదు. పసివాడవు ఇంకా జీవితాన్ని అనుభవించ వలసిన వాడవు. క్షమాపణ కోరుకో. నామాటలు విను.

కేదారుడు. ఇది మీ ఆస్థానానికి గౌరవమా ?

శిల్పులు. కేవలం వాత్సల్యం.

కేదారుడు. ప్రభూ! వాదార్థిని అవమానించుట ధర్మమా ?

రాజు. ఇది అవమానమా ?

జక్కన. రంధ్రాన్వేషీ, దోష మేమంటివి ?

కేదారుడు. అలా త్రోవకు రండి. (మెల్లగా) శిలాదోషము.

రాజు. ఏమిటి ?

కేదారుడు. అవును ప్రభూ, ప్రతిష్ఠ చేయదలచిన విగ్రహంలో శిలా దోష మున్నది.

శిల్పులు. శిలాదోషమా !

జక్కన. (అర్ధనిమీలితలోచనుడై కొంత తడవు మాట్లాడక) ఊఁ— శిలాదోషమా.

[మళ్లీగంటలు, మంత్రాలు వినిపిస్తాయి.]

కంచుకి. మహారాజా ! పురోహితులు తమ దర్శనార్థం—

రాజు. ఆచార్యా ప్రతిష్ఠ నేటికి ఆగవలసిందేనా ?

జక్కన. (నిబ్బరంగా) ముహూర్తం ఆగదు.

రాజు. ఈ మీనమేషాలతో నాకు నిమిత్తంలేదు. (కేదారునితో) ఓయీ విపరీతవాదీ, నీవు పేర్కొన్న దోషాన్ని వెంటనే ప్రత్యక్షంగా చూపించగలవా ? లేక—

కేదారుడు. మంచి గంధాన్ని తెప్పించండి.

1676

రాజు. ఎవరది?

కంచుకి. చిత్తం ప్రభూ!

జక్కన. పురోహితుల నడిగి పూజార్థం తీసిన మంచిగంధాన్ని తీసుకొనిరా.

రాజు. ఇంత చిన్నతనంలోనే విరక్తి కలగటం విచిత్రం!

కేదారుడు. విధ్యుక్త ధర్మం.

రాజు. (కనికరంతో) ఒకసారి నీకోసం వేచివున్న వృద్ధుని చూస్తావా?

కేదారుడు. కృతజ్ఞుడను. అప్పుడే మృత్యువు నాచాయలకు రాజాలదు.

శిల్పులు. (నవ్వుతూ) వృద్ధు బయట కాపలా కాస్తున్నాడు.

కేదారుడు. (కోపంతో) నోరు జార్చుకొన్నంత మాత్రాన ప్రయోజనం లేదు. (కంచుకి గంధపు గిన్నెతో వస్తాడు.)

జక్కన. గంధం వచ్చింది. ఇక దోషం వెలువడవలసివుంది.

కేదారుడు. అదెంత సేపు భాగ్యం. ప్రభూ, ప్రతిష్ఠ చేయనున్న విగ్రహానికి గంధం పూయిస్తారా?

రాజు. మామూలుగా పూస్తే సరిపోతుందా?

కేదారుడు. విగ్రహ మంతటా సమంగా పూయాలి.

రాజు. ఎవరురా అక్కడ?

కంచుకి. చిత్తం ప్రభూ!

కేదారుడు. లేదు. సేవకుల వల్ల కాదు. మీ శిల్పుల చేత పూయించండి.

జక్కన. వారు నీకు అన్యాయం చేయవచ్చును. వారు ఏ బొడ్డు దగ్గరనో లేక, మరొక చోటనో తక్కువ పూయవచ్చును.

కేదారుడు. లేదు. శిల్పుల చేతులు అలా వ్యభిచరించవు. వారి పట్లనాకు విశ్వాస మున్నది.

రాజు. శిల్పులారా, మీరు త్వరగా పొండి.

కేదారుడు. గంధం ఆ విగ్రహం మీద ఆరీ ఆరక ముందు నాకు తెలియ చేయాలి.

శిల్పులు. అలాగే. [వారి వెంట గంధపు గిన్నెతో కంచుకి వెళ్లుతాడు. బయటికి వస్తారు]

1 – శిల్పి. విచిత్రంగా వుంది.

2 – శిల్పి. నిజంగా విగ్రహంశిలలో దోషముంటుందంటారా.

3 – శిల్పి. ఉండవచ్చునేమో.

1 – శిల్పి. సరేకాని బొడ్డుదగ్గర తక్కువగంధం పూయమని ఆచార్యులు సెలవిచ్చారా ?

2 – శిల్పి. ఆచార్యులు అలాంటి సైచ్యానికి పూనుకోరు.

3 – శిల్పి. మరి ఆమాటదేనికన్నారు ?

1 – శిల్పి. మరిదేని కన్నట్లు ?

3 – శిల్పి. విగ్రహనాభిస్థానంలో దోషముందేమో ?

1 – శిల్పి. ఆచార్యులకు తెలుసునంటారా ?

5 – శిల్పి. ఏమో తెలిసి తెలిసి యీదోషాన్ని ఉపేక్షిస్తాడని నేననుకోను.

3 – శిల్పి. మొదటినుంచి ఏదోదిగులుతో, పరధ్యానంతో ఉన్నట్లు కనిపిస్తున్నాడు.

1 – శిల్పి. ఏదిఎలా ఉన్న రాజు చండశాసనుడు.

3 – శిల్పి. ఎవరు ఓడినా ఫలితం భయంకరం.

2 – శిల్పి. బొడ్డుదగ్గర గంధం పూయకుండావుంటే ?

1 – శిల్పి. అన్యాయం.

3 – శిల్పి. ఆచార్యులపట్ల అవజ్ఞ. శిల్పధర్మాన్ని అతిక్రమించరాదు.

2 – శిల్పి. ఈఘోరాన్ని, చూస్తూచూస్తూ చేయవలసినదే నన్నమాట !

3 – శిల్పి. ఎవరి రక్తాన్నో చూడకతప్పదు. (వెళ్లిపోతారు.)

రాజు. భూమి సూర్యునిచుటూ తిరగటంలేదు. సప్తగ్రహాలు స్తంభించి పోయినట్లున్నాయి.

జ. ఇప్పుడేకద శిల్పులు వెళ్లినది. వారు గంధాన్ని పూయాలి. ఆమీదట ఆరాలి.

రాజు. ఏమో ప్రకృతి అంతా స్తంభించిపోయినట్లున్నది. పవనం కూడ బంధించినట్లున్నది. భుజమదురుతూ వుంది.

జక్కన. అది కుడి భుజం

కంచుకి. ప్రభూ. (ప్రవేశిస్తాడు.)

రాజు. గంధం పూత ముగిసినదా ?

కంచుకి. ఇప్పుడే పూర్తి అయినది. ఇక ఆరవలసి వుంది. ఏలినవారు...

రాజు. చేతులు నలుపుకుంటున్నావు దేనికి ?

కంచుకి. ఆ వృద్ధు......

రాజు. చూట్టానికి వీలులేదని చెప్పలేదా ?

కంచుకి. చెప్పాను ప్రభూ...మీ దారుణశాసనాన్ని ఆయనకు ఎవరో చెప్పినట్లుంది. వీరికోసరం ఆయన తహతహ పడుతూవున్నాడు.

రాజు. (కేదారునితో) మీకు బంధువా?

కేదారుడు. మాగురుదేవులు.

రాజు. అయితే వెంటనే తోడ్కొనిరా.

కేదారుడు. వలదు ప్రభూ !

జక్కన. ఎందుకని?

కేదారుడు. వారు వస్తే నేను వాదించటానికి వీలులేదు.

రాజు. అయితే ముందే యీ పని చేస్తే తీరిపోయేది. ప్రతిష్ఠ పూర్తి అయిపోయి వుండేది.

జక్కన. వారు మిమ్ము మందలించారా ?

కేదారుడు. అవును.

జక్కన. అయితే గురు తిరస్కారానికి కూడ దిగారన్న మాట.

కేదారుడు. ధర్మం శాసించినప్పుడు తప్పదు.

కంచుకి. ఏలిన వారు ఏమని సెలవిస్తారు.

కేదారుడు. ఈ వాదం తేలేటంతవరకు వారిని తీసుకొని రాకు.

కంచుకి. అంతేనా

రాజు. మరిగత్యంతరం లేదు.

జక్కన. శిల్పులు వస్తున్నారేమో చూడు.

కంచుకి. అదిగో ఇద్దరు వస్తున్నారు.

రాజు
కేదారుడు
జక్కన } ఏమైనది ?
అన్ని చోట్ల ఆరిపోయినదా ?

1 - శిల్పి. అంతట గంధం ఆరిపోయినది.

జక్కన
కేదారుడు } నిజమే ?
ఎక్కడా చెమ్మ మిగులలేదా ?

2 - శిల్పి ఎక్కడా మిగుల లేదు—

1 - శిల్పి. ఒక్క నాభి కమలంలో తప్ప.

కేదారుడు. ఆచార్యా తేలిపోయినదా ?

జక్కన. (తలవంచు కొంటాడు.)

రాజు. (ఆశ్చర్యంగా)ఏమి తేలినట్లు ?

కేదారుడు. శిలాదోషమున్నట్లు. (శిల్పులవంక తిరిగి) శాణంతో నాభి కమలంవద్ద తొలవండి.

శిల్పులు. (రాజు వంకచూస్తారు.)

కేదారుడు. ఆలస్యం దేనికి ?

శిల్పులు. అలాగే. (వెళ్లిపోతారు.)

రాజు. (ఆతురతో పచారు చేస్తూ) నిజంగా దోషమే ! లేదు, లేదు. అలా ఎప్పటికీ జరగదు. లోకోత్తరశిల్పి శిలాదోషాన్ని గమనించకుండాఉంటాడా ? లేదు—లేదు. ఎవరురా అక్కడ ? ఎవరూ పల్కరేం ? ఆదివ్యసుందర విగ్రహాన్ని వికలంచేయటమే ! ఎవరది ? (సమాధానం రాదు.) సమాధానంకూడ లేదు. రాజు పిలిస్తే పలికేవాళ్లుకూడ లేరు.

జక్కన. ఏమి ప్రభూ ?

రాజు. ఆ విగ్రహాన్ని వికలంచేయటానికి వీలులేదు.
జక్కన. ఇప్పుడెవ్వరూ ఆపలేరు.
రాజు. ఆంధ్రసమ్రాట్టు ఆజ్ఞాపిస్తూవున్నాడు.
జక్కన. ఆంధ్రసమ్రాట్టు ఆజ్ఞాపించడు—ఆజ్ఞాపించజాలడు.
రాజు. లేదు. వల్లకాదు. ఎవరురా అక్కడ ?
జక్కన. వీలులేదు. ప్రభూ, ద్రోహం.
రాజు. లేదు. ఆవిగ్రహాన్ని వికలం చేయ్యటానికి వీలులేదు. ఇది సమ్రాట్టు ఆజ్ఞ. (ఉగ్రుడై) ఎవరురా అక్కడ ?
కంచుకి. చిత్తం ప్రభూ.
రాజు. విగ్రహాన్ని తాకవలదని శిల్పులకు చెప్పు. పో, త్వరగా పో !
జక్కన. ఏయ్ కంచుకీ, ఆగుయ్.
రాజు. పో, త్వరగా పో !
కంచుకి. (నివ్వెరపడి చూస్తాడు.)
జక్కన. ఆగు !
రాజు. (మండి పడుతూ) ఆంధ్ర సమాట్టు ఆజ్ఞాపిస్తూ వున్నాడు.
జక్కన. వీలులేదు. ఒక క్షణం ఆగు. ఆచార్యుడు కోరుతూవున్నాడు.
రాజు. ధిక్కారమా, పో.
కంచుకి. తలారి దగ్గరకు పొమ్మందురా?
రాజు. ఏమి అపాగరు !
కంచుకి. కాదు—ప్రభూ...
రాజు. ఆఁ! అంతవరకు వచ్చినదా? సరే తలారి దగ్గరకుపో—తరువాత శిల్పుల దగ్గరకు వెళ్లు.
జక్కన. తలారి దగ్గరకు వెళ్లిన తరువాత శిల్పులదగ్గరకు వెళ్లగలవా?
కంచుకి. ఏలికవారి సెలవైతే చాలు. మొండెమైనా శిల్పులదగ్గరకు చేరుతుంది.
కేదారుడు. ఏమి రాజభక్తి !

కంచుకి. అదుగో శిల్పులు.

1 – శిల్పి. ప్రభూ, ప్రభూ...

రాజు. ఏమి జరిగింది ?

2 – శిల్పి. విగ్రహనాభివద్ద శాణంతో తొలిచాము.

3 – శిల్పి. కప్ప ఎగిరి బయటపడ్డది.

2 – శిల్పి. నీళ్లుకూడ ఉన్నాయి ప్రభూ !

కంచుకి. కప్ప, కప్ప ! కప్పబయాటకు దూకింది ! ప్రాణంతోవుందా ?

3 – శిల్పి. ప్రాణం లేకపోతే ఎలా ఎగురుతుంది ?

కంచుకి. తలకోల్పోయిన నేను మాట్లాట్టంలేదా ?

2 – శిల్పి. నీకు తలఎప్పుడు పోయింది ?

కంచుకి. ఒక్క క్షణంక్రిందటనే.

3 – శిల్పి. నిజంగా నీకు తలలేనట్లుగానే వుంది.

రాజు. (క్రుంగిపోయి) ఇకకర్తవ్యం (ఎవరూమాట్లాడరు.) జక్కనాచార్యా.

జక్కన. ఆచార్యపదం నాకిక తగదు ప్రభూ...

రాజు. ఇకకర్తవ్యం ?

జక్కన. శిల్పకోవిదులు చెప్పాలి.

రాజు. ప్రతిష్ఠకు మార్గాంతరం లేదా ? ఈమహోత్సవం భగ్నం కావలసినదేనా ? జనులు హతాశులై తిరిగిపోవలసినదేనా ? గౌరవం దక్కే మార్గంలేదా ?

కేదారుడు. ఏలినవారు సెలవిస్తే ఈజ్యోతిర్లింగాన్ని—

రాజు. జ్యోతిర్లింగమా.

కేదారుడు. (ఉత్తరీయం కొంగున భద్రంగా దాచిన లింగాన్ని బయటికితీసి) ఇదిగో ప్రభూ!

రాజు. (అందుకొని చూస్తూ) కన్నులు మిరుమిట్లు కొల్పుతూవుంది. వత్సా ఇది నీవు చెక్కినదేనా?

కేదారుడు. లేదు. మా అమ్మది. వచ్చేటప్పుడు వలదన్న కొలదీ నా ఉత్తరీయం కొంగున ముడిచింది.

రాజు. దీనిని నాకు ఇచ్చివేస్తావా? (జక్కనతో) ఆచార్యా, ఆచార్యా అంటే పలుకరు కాబోలు. జక్కనాచార్యా, ఇది ప్రతిష్ఠకు పనికి వస్తుందా? (జక్కనకు అందిస్తాడు.)

జక్కన. (దానిని పరిశీలిస్తూ వుంటాడు. అతని చెక్కిళ్ల వెంట రెండు అశ్రుబిందువులు జారుతాయి.)

రాజు. (రిచ్చవోయి) ఆచార్యా, ఆచార్యా !

జక్కన. (గాద్గద్యంతో) మీ అమ్మ యీ జ్యోతిర్లింగాన్ని చెక్కినదా ?

కేదారుడు. అవును. నేను పుట్టకముందు చెక్కినదట.

జక్కన. ధన్యోస్మి, ధన్యోస్మి. అయితే నీకిప్పుడు 18 సంవత్సరాల అయిదు మాసాల ఏడురోజులన్నమాట.

కేదారుడు. (ఆశ్చర్యంగా) మీ కెలా తెలిసింది!

జక్కన. ప్రభూ, కృతార్థుడను. ఇక మీ ప్రతిజ్ఞను చెల్లించండి.

రాజు. (మాట్లాడడు.)

జక్కన. సంకోచం దేనికి ప్రభూ ? రాజప్రతిజ్ఞ వృథా కారాదు.

కేదారుడు. ప్రభూ...

జక్కన. లేదు. రాజప్రతిజ్ఞ తప్పటానికి వీలులేదు. ఎవరురా అక్కడ ?

కంచుకి. చిత్తం ఏమి సెలవు ?

జక్కన. తలారిని పిల్చుకొనిరా.

కంచుకి. ఈ వార్త చెబుతాను. ఈ మొండెంమాత్రం ఇంతదూరం తిరిగి రాలేదు.

జక్కన. అయితే వెంటనే పిలుపించు. (బయటికి వెళ్లుతాడు.)

కేదారుడు. ప్రభూ ! ప్రభూ. మీ ప్రతిజ్ఞ పాటించ నవసరం లేదు. పాటించాలని నేను కోరటం లేదు.

రాజు. రాజాజ్ఞ ఎప్పుడూ భగ్నంకాదు.

కేదారుడు. నేను ఒక్క వరం కోరవచ్చునా ?
రాజు. ఆయన చేతులు తప్ప.
కేదారుడు. ఈ జ్యోతిర్లింగాన్ని ఇవ్వటానికి వీలులేదు.
రాజు. కోరిన ధనం ఇస్తాను.
కేదారుడు. డబ్బుతో నాకు నిమిత్తం లేదు.
కంచుకి. ఆ వృద్ధు వస్తూవున్నాడు.
తాతయ్య. బాబా, బాబా, పలకవేమిరా ? (గట్టిగా) బాబా, బాబా, నీవు సురక్షితంగా ఉన్నావా ? ఎవరది (రక్తంలో కాలు జారి పడతాడు.) అబ్బ, ఇస్, ఎవరది, పలకరేం ? ఈ అంధునితో మాట్లాడగూడదా ? వార్ధకంతో పరిహాసమా ! బాబా, బాబా, (కాలికి శరీరం తగులు తుంది.) బాబా, నువ్వు కాదు గదా ! లేదు, నా మనమడు అంత నిర్దయుడు కాడు. బాబా, బాబా, (శరీరాన్నితడివి చూస్తాడు.) ఎవరది ? క్రూరులు—
జక్కన. నిజంగా క్రూరుడను.
తాతయ్య. ఎవరది—ఎవరది ? బాబా !
కేదారుడు. ఓయ్, వస్తున్నా.
జక్కన. నేను (ఆయాసంతో) నేను గురూ !
తాతయ్య. నేను... నేను—భ్రాంతిపడ్డానా !
రాజు. అదేమి ?
కేదారుడు. రాజశాసనం.
జక్కన. ఈ కంఠాన్ని ...18 సంవత్సారాల ఆరుమాసాల క్రితం విన్నారు.
తాతయ్య, ఏమన్నావ్. (చతికిల బడి శరీరాన్ని తడువుతూ) ఎవరది ? మఖాదేవ్ ! (పెద్దగా) మఖాదేవ్ ? నువ్వేనా ? నిజంగా నువ్వే ?
మఖాదేవుడు. నేనే గురూ.
తాతయ్య. (మొండిచేతులను తడివి పుచ్చుకుంటాడు. మఖాదేవుడు

బాధపడుతాడు) ఈ రక్తమేమిటి ?

మఖాదేవుడు. పవిత్రురాలైన భార్యను అవమానించినందుకు ఫలితం.

తాతయ్య. బాబా, నువ్వే చేశావా? నీ తండ్రిచేతులు నరికించావా ?

కేదారుడు. (నిలువునా నీరై) నా...తండ్రిగారా ? నాతండ్రి చేతులనే నేను ఖండించానా ? ... ద్రోహిని, గురుద్రోహిని ... (ముఖం కాసేపు చేతుల్లో దాచుకొంటాడు.) తాతయ్యా, నువ్వు చెప్పినది పుక్కిటి పురాణం కాదన్నమాట! అవును... తాతయ్యా నీవు చెప్పినట్లు నాగురువుల చేతులను ఖండించాను. మహాపాపిని.

జక్కన. వత్సా, ఏడువకు. కళావీరుడైన తండ్రి కొడుకునుంచి ఇంతకన్నా కోరదగిన దేముంది? నిన్ను కన్నందుకు ఈ జన్మంచరితార్థమైంది. నాయనా కొలుకుల నీళ్లు తుడుచుకో. ధర్మాన్ని నీవు నిర్వహించావు. ఈనాటికి నాతపస్సు పండినది. ఏడువకోయ్, ఏడువకు. ఈపవిత్ర సమయంలో నీతండ్రి ఆనందిస్తూవున్నప్పుడు ఇది తగదు.

రాజు. (సమీపించి) జక్కనాచార్యులు మీకు పితృపాదులా.

తాతయ్య. అవును. తండ్రిచేతులు కొడుకు నరికించివేశాడు. బాబా, సంతృప్తి లభించిందా ?

జక్కన. గురూ, చిరంజీవిని అంటే ఫలమేముంది ? తండ్రి ఇంతకన్నా కోరుకోవలసింది ఏముంది ?

తాతయ్య. బాబా, ఎవరుగెలిచారు ?

కేదారుడు. (గాద్గద్యంతో) నేను గెలవలేదు.

రాజు. (సాహంకారంగా) గెలుపుమాది.

తాతయ్య. బాబా, తెలిసినదా రాజులచిత్తవృత్తి? మఖాదేవ్, ఇక ఈ కొలువులో క్షణంసేపు నిలువవద్దు. ఇంటికి వెళ్లుదాం పద.

జక్కన. గురూ, గురూ, ఏముఖంతో వచ్చేది. శిల్పశ్రీని ఎలాచూచేది ?

తాతయ్య. అల్లుని చేతులు నరికించిన తండ్రి కూతురు ముఖం ఎలా చూస్తాడు ?

కేదారుడు. మహా గురుద్రోహిని.

తాతయ్య. లెండి — తండ్రీ కొడుకులు బయలు దేరండి.

జక్కన. నేను ఆమెముఖం చూడలేను, ఈ మొండి చేతులతో ఆమెను దర్శించలేను.

తాతయ్య. నిర్దయుడా! ఇంకా ఆమె హృదయం అర్థం కాలేదా? ఎన్నో ఏండ్లనుంచి అలమటించి పోతూవుందే. ఆమె బ్రతకటం నీకిష్టం లేదా? లే, బయలుదేరు. బాబా. దారిచూపించవూ?

రాజు. పూజ్యులారా, కరుణించండి. ప్రతిష్ఠ భగ్నం కావలసిందేనా?

తాతయ్య. ఈ దరిద్రదేశం ఇలా ఉన్నంతకాలం రాజుల ప్రతిష్ఠకు భగ్నంలేదు. బాబా, మఖాదేవ్, పదండి.

కంచుకి. ఆచార్యా — ఆచార్యా! నాతల.

మఖాదేవ్. రాజుగారి అదుపులో వుంది పుచ్చుకో.

కేదారుడు. (జ్యోతిర్లింగాన్ని తండ్రి రక్తంలో తడిపి) రాజా, ఇదిగో! నాపితృదేవుల రక్తంతో అభిషిక్తమైన జ్యోతిర్లింగం. నీక్రౌర్యాన్ని శాశ్వతంగా ప్రతిష్ఠించుకో, తాతయ్యా మనం వెళ్లుతున్నాము.

తాతయ్య. నీ తండ్రికి, నీతాతకు దారిచూపించు.

(ముగ్గురూ వెళ్లుతూవుంటారు.)

(రాజు. కంచుకి, శిల్పులు నిర్విణ్ణులై చూస్తూ వుంటారు.)

శిల్పులు. ఆదర్శశిఖరాలు వెళ్లిపోతున్నాయి!

ఆంధ్ర శిల్పకళలు, జారి పోతున్నాయి!

తెర

జూలై '43

దో పి డి

పాత్రలు

*

గురువు

శిష్యుడు

సిద్ధాంతి

అవధాన్లు

శాస్త్రి

శర్మ

శబరనాథుడు

శాంబరీ భిల్లుడు

అధిజ్యధన్వుడు

బాటసారులు

★

[అరణ్యమార్గం. చరమదిశను సంధ్యా రాగం కనిపిస్తూ ఉంటుంది. సిద్ధాంతి, అవధాన్లు, శాస్త్రి, శర్మ పింజలు పోసి కట్టిన నీరుకావి దోవతులతోను, పిలకముళ్లతోను నడుస్తూవుంటారు. అందరికీ జంధ్యాలు, అందరి దగ్గిరా చిన్న చిన్న బొక్కిశాలు, కాళ్ళకు చెప్పులూ వుంటాయి. ప్రొద్దు గ్రుంకుతూ వున్నదన్న భయంతో తొందరగా నడుస్తూవుంటారు.

వీరికిముందు రెండువందల గజాలదూరంలో నలభైయేండ్ల బ్రాహ్మణుడు అతని శిష్యుడూ వెళ్లుతూవుంటారు. గురువు దగ్గిర వీణ ఒకటి వుంటుంది. కాళ్లకు పాముకోళ్లు ఉంటాయి. శిష్యునికి చెప్పులుకూడ ఉండవు. గురుశిష్యుల ముఖాల్లో బ్రహ్మవర్చసము ఉట్టిపడుతూ వుంటుంది.]

సిద్ధాంతి. (పెద్దగా) ఏమండోయ్! కొంచెం ఆగండి!

శిష్యుడు. (తన ముందు ఎవరో పోతున్నట్లు, వారిని సిద్ధాంతి కోసం పిలుస్తూ ఉన్నట్టుగా చేయెత్తి కొంటెతనంగా కేకవేస్తూ) ఏమండోయ్, కొంచెం ఆగండి!

గురువు. నిజంగా బ్రహ్మచారివిరా!

అవధాన్లు. కుర్రాడి దగ్గర పలుకు చాలావుంది.

సిద్ధాంతి. (శిష్యుణ్ణి లెక్కచెయ్యకుండా) ఎవరండోయి, ముందు వెళ్లే బ్రాహ్మలు! కాస్త మమ్మల్నికూడా కలవనీండి. మేముకూడా వచ్చే వాళ్ళమేగా!

(గురువు ఆగుతాడు. విధిలేక శిష్యుడుకూడా విసుక్కొంటూ ఆగుతాడు.)

సిద్ధాంతి. (సమీపించి గురువుతో) ఏమండీ, మేముకూడ వచ్చేవాళ్లమే కదా! కాస్త కలుపుకు పోగూడదటండీ! అందులో యిది అడివిదారి గదా?

గురువు. మిమ్మల్ని చూడలేదు. ఏదో మా ధోరణిలో ఉండి మీరు వస్తున్న

సంగతే గమనించలేదు. కొంచెం ఆగితే మా సొమ్మేమి పోతుంది?

శిష్యుడు. గురువులవారు క్షమించాలి. (సిద్ధాంతి బుజానవున్న పెద్ద బొక్కిశావంక చూస్తూ) ఆ మూటను నన్ను తెమ్మంటే లాభంలేదు. తిప్పారు తిప్పారు, సప్తలోకాలు తిప్పారు. కాళ్లన్నీ బొబ్బలెక్కాయి.

అవధాన్లు. పాపం, నాలుగుకాళ్లు పొక్కిపోయాయి!

శిష్యుడు. (అవధాన్లను ఉద్దేశించి) అయ్యా, నాకు తోక ఒకటే తక్కువ. అది ఉంటేనా, నా అవస్థ ఆ పరమాత్ముడికే తెలియాలి.

గురువు. తప్పు, తప్పు. పెద్దలను అలా అనగూడదు.

శిష్యుడు. వారి పెద్దరికాన్ని ఏ మాత్రం నిలబెట్టుకొన్నారు గనక నన్ను మందలిస్తారు?

గురువు. పెద్దలేమన్నా పిన్నవాళ్లు పడాలి. ఇదిగో, పాపం వారు (సిద్ధాంతిని చూపుతూ) డస్సిపోయారు. ఆ మూట కాస్త అందుకో (శిష్యుడు జాలిగా మొగాము చేస్తున్నట్టుగా చూస్తాడు) ఎప్పుడు వస్తుందిరా నీకు బుద్ధి?

శిష్యుడు. (సిద్ధాంతి దగ్గరనుంచి మూటను తీసుకొంటూ) ఎప్పుడు ఇంటి దగ్గర చెప్పకుండా బయలుదేరానో అప్పుడే వచ్చింది. (సిద్ధాంతితో) ఏమండోయ్ పెద్దలసేవ ఊరకనే పోదంటారు. ఇందులో సగం నాకు రావాలి. ఏదో మాట సామెత కంటున్నా ననుకోనేరు. తరువాత మీ యిష్టం.

సిద్ధాంతి. (నవ్వుతూ) అలాగేరా అబ్బాయి.

శిష్యుడు. ఇందులో గావంచా బుడ్డిచెంబూ తప్ప మరేమీ లేవా ఏమిటి? (మూట తీసుకొంటూ) అబ్బో, బరువుగా వుందే! అయ్యా, మీకు మీ మూటకూ ఒక నమస్కారం. ఇందులో నాకు భాగం వద్దు.

సిద్ధాంతి. ఏం అలా అంటున్నావు?

శిష్యుడు. ఇదంతా పాపంలాగా వుంది. లేకపోతే ఇంతబరువుగా ఉండదు. భాగం పెట్టటానికి మీరింత తేలిగ్గానూ ఒప్పుకోరు. గురుదేవా, మీరు

యీ శిష్యపరమాణువుకి ఉపదేశించలా; పాపం కన్నా బరువైన వస్తువు ప్రపంచంలో లేదని. అప్పుడే మరచి పోయారా ?

గురువు. పెద్దవాళ్ళను అలా అనవచ్చునురా ? ఛీ, తప్పు !

సిద్ధాంతి. వాడిదేముంది లేండి పసికాయ, (శిష్యునితో) అబ్బాయీ మీ గురువుల నామధేయ మేమన్నావు ?

శిష్యుడు. ఏమిటి ! ఏమిటి ! ఎంత అనాచారవంతుణ్ణైనా గురువుల పేరు చెప్పనా ? (మిగతా వాళ్ళనుచూచి) మీరంతా వింటున్నారుగా గురువుల పేరు చెప్పేది ?

సిద్ధాంతి. (రిచ్చవోయి) వీణ్ణెక్కడ పట్టుకొచ్చారండీ ? ఏదో నాలుగు ముక్కలు చదువుకున్న వాణ్ణే కదా ! ఇందరిలో నన్నిలా ఎండేస్తా డేమంటా ?

గురువు. తమరేమీ అనుకోకండి, వాడి తరహా అంత. వాడు నన్ను మాత్రం మన్నిస్తూవున్నాడా ? ఏదో రెండు ముక్కలు చెబుతున్న వాణ్ణి గదా ! నా చేత యీ వీణ మోయించకపోతే కాస్త పట్టురు రాగూడదూ ?

శిష్యుడు. అన్యాయం, అన్యాయం ! తమ రనుగ్రహిస్తే మిమ్మల్నీ, మీ వీణని విశ్వం ఆకొసనుంచి యీ కొసకు మోయకపోయానా ? వీడి మీద అనుగ్రహం కలగలేదు. ఆ వీణతో వుడాయిస్తా నేమోనని భయ మాయిరి ! మీరే చూస్తూవుండండి. గురుదేవా ఆవీణను ఇలా ఇవ్వండి. ఇంత బరువు మోస్తున్నవాణ్ణి ఆకాస్తిదాన్నికూడ తేలేక పోతానా ? (గురువు నవ్వుతాడు. వీణను మాత్రం ఇవ్వడు) చూశారుగా. (నిట్టూ రుస్తూ) లోకులమ్మ కన్న బిడ్డ తేరగా ఉన్నాడని ఇలా చెయ్యటం ఏ మాత్రం బాగులేదు.

గురువు. మీ అమ్మ ఎంత వస పోసిందో !

శాస్త్రి. నీకాళ్లు పట్టుకొంటాము. ఏడిపించక వారి పేరేదో కాస్త చెప్పుమూ ! పెద్దల సాంగత్య భాగ్యానికి మమ్మల్ని వెలిచేయకు.

శిష్యుడు. ఆ వీణతో కలిపి మనిషి పేరు చెప్పమంటారా? లేక వట్టి మనిషి పేరే చెప్పమంటారా?

అవధాన్లు. తలకాయ ఉంచుకొని చెబుతావా? తలకాయ లేకుండా చెబుతావా?

శిష్యుడు. తమవంటి వారి దగ్గర తలకాయ కావాలా?

శాస్త్రి. బాబూ పుణ్యముంటుంది. ఎలాగో ఓలాగు చెబుదూ.

శిష్యుడు. అలా అడగండి. వీణతో కలిపి సభాపతి మహర్షి అంటారు. వీణ లేకపోతే సభాపతి అంటారు.

శాస్త్రి. నిజం చెప్పవయ్యా నీ యిల్లు బంగారంగాను.

శిష్యుడు. నిజం కాక అబద్ధం చెప్పవలసిన కర్మ నాకేం పట్టింది?

అవధానులు. వీణ లేకపోతే సభాపతి, వీణ ఉంటే సభాపతి మహర్షీ నా? చిత్రంగానే వుంది.

శిష్యుడు. మరే మనుకున్నారు. ఆ వీణ లోనే ఉంది మహర్షిత్వం. వాయించినా, వాయించకపోయినా ఆ వీణ ఎప్పుడూ కుయ్యోం, కుయ్యోం అంటూనే వుంటుంది ఉబ్బసపు రోగి శ్వాస లాగా. ఎనిమిది చెవుల దేవుడు కాబట్టి ఒక తల కాకపోతే ఒక తలన్నా నిద్రపోతుంది గనక ఎప్పుడూ 'వినగలుగుతూ వున్నాడు. మరొకడైతేనా యీ రణగుణ ధ్వనికి...

అవధానులు. (గురువుతో) తమరేదో సామాన్యమానవు డనుకున్నాము. మా తప్పు క్షమించండి. (నమస్కరిస్తాడు.)

గురువు. (నవ్వుతూ ఆశీర్వదిస్తాడు.)

శిష్యుడు. (సిద్ధాంతితో) ఏమయ్యోయి, నువ్వుకూడా. అందరిలాగా మా గురువుగారి కొక్కరికే నమస్కరిస్తున్నావే. అప్పుడే యీమాటను తెచ్చి పెడుతున్నా నన్న సంగతి కూడా మరచిపోయినట్లుందే.

గురువు. శ్రుతి మించి రాగాన పడుతూవుందే!

శిష్యుడు. ఏదో తడిగాలి వీస్తున్నది కాదూ? అందువల్ల నెమ్ముకొని

వీణాతంత్రులు అపశ్రుతులు పలుకుతున్నాయేమో. ఆ వీణ ఒక్క సారి యిలా ఇవ్వండి. సవరిస్తాను.

అవధానులు. మొత్తంమీద మంచి శిష్యుడే — దొరికాడు ఆషాఢభూతిగాడు!

సిద్ధాంతి. (గురువుతో) తమ రెందాక వెళ్లుతున్నారు?

గురువు. ఎందాకని చెప్పగలను. రస సృష్టికర్త లభించేటంతవరకు తిరుగ దలచాము.

సిద్ధాంతి. రససృష్టికర్త లభించేటంతవరకూనా?

శిష్యుడు. ఆఁ, ఆఁ! నీరస మేర్పడి రసం దొరికేటంతవరకూ వెళ్ల దలచాము.

అంతా. రసమా! (ఆశ్చర్యంగా)

శిష్యుడు. అవును రసమే.

అవధానులు. మీ దేశంలో రసంలేదు? రసం లేకుండా ఎలా బ్రతుకు తున్నారు? వైద్యులకు క్షణం గడుస్తూవుంది?

శిష్యుడు. నీరసాన్ని కావలసినంత ఇస్తాము.

అవధానులు. షడ్రసాల్లోని రసమా? అంత శ్రమపడ నక్కరలేదు. కోసలాధిపతులున్నంతవరకూ దానికేమీ కొదువలేదు. మేము ఆ మహారాజుల యజ్ఞమువాటి నుంచే వస్తూ ఉన్నాము.

శిష్యుడు. నిజమైన బ్రాహ్మడివి నువ్వేనయ్యా.

సిద్ధాంతి. అదిగాదురా అవధాన్లు. శ్రుతి ఏమి చెబుతూవుంది? 'రసో వైసః' అంటే రసము భగవంతుని స్వరూపమేగా. వీరు ఆ భగవానుని దర్శనం అయ్యేదాకా యిలా సంచారం చేస్తూనే వుంటారు.

శిష్యుడు. అదీ అసలు సంగతి! (అంతలో ఆతురతతో) గురూ, గురూ కొంపదీసి దాని కోసమే కాదుగదా బయలుదేరింది? నిజం చెప్పండి. వచ్చేటప్పుడు మా అమ్మకుకూడ చెప్పిరాలా. అందులో మా అమ్మ నాన్నకు నేనొక్కణ్ణే. నాసంగతి ఎలా ఉన్నా వారు అలమటించి

పోతారు. పైగా నాకు పెళ్ళి చేయాలనుకుంటూ వున్నారు. వారి అచ్చటా ముచ్చటా యిలా ధ్వంసం చెయ్యటం ఏమాత్రం భావ్యంకాదు.

అవధాన్లు. నీ ముచ్చట ఎలావున్నా పెద్దలముచ్చట భగ్నమై పోతుంది మరి.

శిష్యుడు. పెళ్ళాన్ని ఏం చేసుకోవాలో ఇప్పటికికూడా నాకు తెలిదే. నేను పెండ్లికావాలంటున్నానా? అన్యాయం. మీరే చెప్పండి. (శాస్త్రి శర్మల్ని అడుగుతాడు)

శాస్త్రి. అవును.

శర్మ. నిజానికి అంతేగా.

సిద్ధాంతి. (గురువుతో) తమవంటి మహాత్ములు యిలా విప్రుల్ని ఎద్దేవన చేయించటం భావ్యంకాదు.

శిష్యుడు. చూడండి. అవధాన్లుగారు, నేను ఇంతకూ విప్రవినోదినా, వినోద విప్రుణ్ణా చెప్పండి.

గురువు. పెద్దలపట్ల అవజ్ఞ. పూర్వానికి ఎవరో బ్రాహ్మడు పెళ్లికెళ్లుతూ పిల్లిని చంకనెట్టు కెళ్లాట్ట.

శిష్యుడు. క్షమించండి. ఇక మాట్లాడను.

గురువు. (సిద్ధాంతి శాస్త్రి శర్మలతో) అయ్యా తాము గుచ్చి గుచ్చి అడుగుతున్నారు కాబట్టి చెబుతూవున్నాను. ఏదో మొదటి నుంచి మేము కాస్త నాదోపాసకులం. నాదము సాక్షాత్తు బ్రహ్మమే నను కోండి. కాని యీ నాదంవల్ల మానవహృదయంలో కేవలం అవ్యక్త మధురస్పందనం మాత్రమే బయలు దేరుతుంది. కాని లోక సంగ్రహ మనేది జరగదు. అందువల్ల యీ వీణమీద శ్రుతులను కూడ పలికిస్తూ వుంటాము. శ్రుతులంటే నోరస ప్రధానాలు కావు. అందువల్ల రస ప్రధానమైన నాదానికి, శ్రుతులకూ లంగరందటం లేదు. ఏ ఆస్థానానికి పోయినా, నవ్యత్వమూ, రసమూ—కావాలంటున్నారు. కేవలం

రసప్రధానమైన నాదంతో లోకసంగ్రహం జరగదు. కాబట్టి సాహిత్య విశిష్టమైన నాదం కావాలి. దీనికోసం లోకాలన్నీ తపించి పోతూవున్నాయి. ఇలా వీణమీద పలికించటానికి వీలైన లోకోత్తర కావ్యాన్ని ఏ మహానుభావుడు వ్రాస్తాడా అని తిరుగుతూ వున్నాము. అలాంటి మహాకవి ఎక్కడన్నా మీకు తగిలాడా?

సిద్ధాంతి. (ఆశ్చర్యంతో) ఏమన్నారు? కావ్యమా! మీ వంటి పెద్దలు కూడ యిలాంటి అనాచారానికి ఒడిగడుతూ వున్నారా?

గురువు. అనాచారమా?

సిద్ధాంతి. అవును పెద్దలేమన్నారు. 'కావ్యాలాంపాశ్చ వర్జయేత్' అనలా. తమలాంటి వారే యిలా చేస్తే ఇక ప్రపంచం సక్రమంగా నడుస్తుంది?

గురువు. అది దుష్టకావ్యాలను ఉద్దేశించి అన్నమాట. కావ్యం కాని, శ్రుతి కాని సచ్చిదానందం కోసం ఏర్పడ్డాయి. 'ఆనందేన జాతాని జీవంతి' ఆ ఆనందాన్ని అనేక విధాల సాధిస్తూవున్నారు మానవులు. వాటిలో శబ్ద మొకటి.

సిద్ధాంతి. తమబోటి పెద్దలతో వాదించే టంతటి తాహతు మాకుందా?

అవధాన్లు. ఒక మాత్రానికి మా సిద్ధాంతిగారు ఊరుకొనేవారు కారు. తమవంటి తపస్సంపన్నులు అలిగి ఏ పులో సింహమో కమ్మని ఎక్కడ శపిస్తారో నని భయం.

శిష్యుడు. గురూ, గురూ! కరుణించి యే రాయిగానో రప్పగానో శపించండి కాని పెద్దపులో సింహమో కమ్మని శపించకండి. తమరు చెప్పగానే మాటతీసుకోలేదన్న కోపంతో గాండ్రుమని మొట్టమొదట నామీదనే దూకుతాడు. ఈ మాటతో నేను పరుగెత్తలేను. దయ ఉంచండి... అయినా యీ తుచ్ఛప్రాణాలు పోతేమాత్ర మేమి కాని మీ వంటివారికి శిష్యుడు లేకుండా పోతాడు. మీ బట్టలు ఉదకటానికి, ఆకలయితే పండ్లు తేవటానికి, పూజకు పూలు తేవటానికి

ఎవరుంటారు? కాబట్టి ముందాలోచించండి.

అవధాన్లు. అయినా యిలాంటి శిష్య పరమాణువు ఇంకొకరు దొరకొద్దూ!

శిష్యుడు. ఆయన మాటల్ని నమ్మకండి. దయ ఉంచండి.

గురువు. ఎందుకురా ఇంత గల్లంతు చేస్తావు? ఇప్పుడు ఆ ప్రసక్తే రాలేదుగా.

శిష్యుడు. ఇంతకూ ఒకకవి కోసమా ఇలా తమవంటి పెద్దలు ప్రపంచమంతా గాలిస్తూ వుంది?

గురువు. అవును. ఆ మహాత్ముని కోసమే.

అవధానులు. ఒక కవి కోసం ఇంత శ్రమ పడుతూవున్నారా? విచిత్రంగా వుంది. ఈ రోజుల్లో ప్రతిపల్లెలోకూడా పదిమందికవులు దొరుకుతారే. ఇలా పుట్టగొడుగుల్లాగా మొలుచుకొస్తూ వున్న కవుల కోసమా మహర్షు లన్వేషించటం!

శిష్యుడు. అదంతా మాకు తెలీదు. నువ్వేమన్నా కవిత్వం చెబుతావా? మాకాలితిప్పటన్నా ఇంతటితో తీరిపోతుంది.

అవధానులు. (నిట్టూరుస్తూ) ఏదో వినేవాళ్లు లేక పోబట్టి కాని...

శిష్యుడు. ఇంతకు ముందేగా ప్రతి పల్లెలో పదిమంది కవులు దొరుకుతారని అంది?

అవధానులు. అవును, వున్నవారంతా కవులే గాని విని ఆనందించే మహాత్ములేరి? ఇన్నేండ్లకు తమవంటి మహాత్ములు అష్టకష్టాల కోర్చి కావ్యమో, కావ్యమో అంటూ బయలుదేరారు.

గురువు. ఇంతకూ ఆ కవిశ్రేష్ఠుని చూపిస్తారా?

శిష్యుడు. (అవధానిని ఉద్దేశించి) ఏమయ్యోయి! మీరు మహాకవులే. అందులో ఏ మాత్రం సందేహంలేదు. కాని మీ తరువాత గొప్ప కవులెవరో సెలవియ్యండి.

అవధానులు. నా కవిత్వాన్ని గూర్చి చెప్పుకోనులెండి. కాని యీ రోజుల్లో ఒక్కడికీ సంస్కారంలేదు, అనుభవంలేదు, శబ్దతత్త్వమంత

కంటే తెలీదు. ఇవన్నీ ఉన్నా కల్పనాశక్తి, భావనాగరిమ అంత కన్నా ఉండవు. ఇవన్నీ వున్నా రసముండదు. వట్టిసాము గరిడీలుగా వుంటుంది. ఇక లోక సంగ్రహమంటేనో, మీ శిష్యుడిలోని వినయం లాగా ఉంటుంది.

శిష్యుడు. ఇంతకూ నాకే ఎసరు పెడుతున్నారే! మహాకవిని చూపించి చూపించి మా కష్టాలనుంచి గట్టెక్కిస్తూ వున్నప్పుడు తమరేమి నిష్ఠూరాలాడినా సహించాలిసిందే. ఇంతకూ ఆ మహాకవి ఎవరండి?

అవధానులు. (శర్మను చూపిస్తూ) వారు మహాకవులు. మొన్న మొన్ననే కోసలాధిపతులు గజారోహణంతో సత్కరించి ఆ కుండలాల్ని కవిరాజహంసబిరుదాన్ని ప్రసాదించారు.

శిష్యుడు. వారి కవిత్వాన్ని ఆస్వాదించి కోసలాధిపతులు వారిని సత్కరించారా?

గురువు. కవిత్వాన్ని విని ఆనందించ గలిగినవారే లేరంటిరి గదా?

అవధానులు. కోసలాధిపతులవంటి రసికులు నూటికి కోటికి ఒకరన్నా ఉండకపోతారా? లేకుంటే యీ ప్రపంచం నిలవొచ్చిందా? అదిగో వారి కవితాగాంభీర్యం వారి ముఖంలోనే కనపడుతూ వుంది.

శిష్యుడు. ఇంతకూ వారు మీకే మవుతారు? వేరే దురుద్దేశంతో అడగటం లేదు సుమా!

అవధానులు. (కోపంతో) అయితే కోసలాధిపతులు రసికులు కారనీ, ఈ సత్కారాలు వారు చెయ్యలేదనీ, వాటిని చేయించుకొన్నామనీ అంటారా?

శిష్యుడు. ఛీ, ఛీ! అలాంటి అల్పత్వం ఎలా ఆపాదిస్తానండీ! 'జయతి కవేర్భారతీ' (శర్మతో) తమరు కావ్యం వ్రాశారా?

శాస్త్రి. నేనా, కావ్యం వ్రాయటమా?

అవధానులు. 'అతివినయం ధూర్తలక్షణం' అన్నారు. అవసరం వచ్చినప్పుడు చెప్పకోక తప్పదు.

శిష్యుడు. గురూ, ఏదీ వీణా శ్రుతిని చక్కబరచండి. మహాకవి తన కృతిని వినిపించబోతూ వున్నారు.

అవధానులు. అంత సిగ్గరితనం పనికిరాదు. ఏదీ మొన్న అష్టమి చంద్రుణ్ణి గూర్చి వ్రాసిన శ్లోకాన్ని, మృత్యు దంష్ట్రికను గూర్చి వ్రాసిన గేయాన్ని వినిపించు.

(ఇంతలో సింగినాదం వినిపిస్తుంది. గురుశిష్యులు తప్ప మిగతా వారంతా ఉలిక్కి పడతారు.)

శిష్యుడు. మృత్యు దంష్ట్రికనుగూర్చి కంటె మృత్యుంజయునిగూర్చి పాడుకోవటం బాగుంటుంది. ఏమి గురూ, ఏమి సెలవిస్తారు?

(తొందరగా తెమల్చుకొని బయట పడదామని గురువు శిష్యునికి కనుసైగ చేస్తాడు. చీలు త్రోవలు దగ్గరకొస్తాయి.)

గురువు. అస్తమానం కాబోతూవుంది. సంధ్యావిధులను నిర్వర్తించుకోవాలి. (శర్మతో) మరొకప్పుడు మీ కవిత్వాన్ని వింటాము.

సిద్ధాన్తి. మేమూ బ్రాహ్మలమేకదా! దగ్గరలో జలాశయ ముందేమో? ఈ ప్రదేశమంతా మాకు కొత్త. కాస్త మమ్మల్నికూడా మీ వెంట తీసుకెళ్ళండి.

శిష్యుడు. ఈ కుడి ప్రక్కగా పోయేదారి అరణ్యగర్భంలోకి వెళ్లుతుంది. మాకు ఇతర పనులున్నాయి. అందువల్ల ఇటు వెళ్లుతాము. ఆదారి ఉండే, అది నేరుగా జనపదాలకు వెళ్లుతుంది.

సిద్ధాన్తి. దగ్గర్లో జలాశయముందా?

గురువు. ఆఁ, ఆఁ!

సిద్ధాన్తి. సెలవు.

శర్మ. మళ్లీ కలుసు కొన్నప్పుడు తమకు నాకవిత్వం వినిపిస్తాను.

శిష్యుడు. అలాగే, బ్రతికివుంటే తప్పకుండా.

(బ్రాహ్మణులు ఎడమప్రక్కగా లోపలికి వెళ్లుతారు. గురు శిష్యులు కుడివైపుకు వెళ్ళేదారినిబట్టి పోతూఉంటారు.)

శిష్యుడు. నారదా, వాళ్ళకు నేటితో నూరేళ్ళు నిండినట్లేనా ?
గురువు. ఆహా, బ్రహ్మదేవుడుకూడ తప్పించలేదు.
శిష్యుడు. పాపం !
గురువు. (నవ్వుతూ) ఈ వ్యామోహ మెప్పటినుంచి సనత్కుమార్ ! అవునులే. ఇంత సేపటి సంపర్కమే నీవంటి వాణ్ణే ఇలా వంచిస్తూవుంటే సామాన్య మానవుడి సంగతి వేరే చెప్పాలా ?
(కొమ్ములధ్వని మళ్లీ భోయ్యిన వినిపిస్తూవుంటుంది.)
శిష్యుడు. మనం ఈ ప్రాంతంలో ఉంటం ఏమాత్రం మంచిది కాదు. ఇలా నిండు జీవాలను తీయించే కటిక ప్రాచేతసుడు మహాకవి అవుతాడంటావా ?
గురువు. లోకంయొక్క అదృష్టం ఎలావుందో మరి !
(కుడిప్రక్కగా వెళ్లిపోతారు, మళ్లా కొమ్ములధ్వని వినిపిస్తుంది. ఎడమ ప్రక్కనుంచి శబరనాథుడూ, శాంబరీభిల్లుడు అధిజ్యధన్వుడు ప్రవేశిస్తారు. వేషాలు పూర్వంలో ఉన్నట్లే ఉంటాయి. అధిజ్యధన్వుని దగ్గరమాత్రం ధనుస్సుఉండదు. ఖడ్గం, అంబులపొది, యీటె వుంటాయి.)
శబరనాథుడు. అబ్బాయి అధిజ్యధన్వా! మనం ఏమేమి చెయ్యగూడదు ? మొన్నెలాగో నీ నెత్తిమీదికినెట్టి తప్పించుకొన్నాము. ఈసారి వెంట్రుకవాసి పొరపాటు వచ్చిందా పీకలు పోతాయి. చెప్పు, మా నాన్నగా! చెప్పరా పుణ్యముంటుంది ! (వేలుమడుస్తూ) ఒకటి, పెద్దవాళ్ల జోలికి వెళ్లగూడదు. రెండో దేమన్నావు? (తలగోక్కుంటాడు.)
అధిజ్యధన్వుడు. మొన్న చెప్పినప్పుడు ఏం చేస్తున్నా ?
శబరనాథుడు. పై ప్రాణాలు పైనే పోయాయి. కట్టె మాత్రమేగా అక్కడుంది.
శాంబరీభిల్లుడు. ఇంతకూ వాడి విల్లు నువ్వు లాగెయ్య లేదంటావు ?
అధిజ్యధన్వుడు. ఆతడేం చేస్తాడు ? శబరాధిపతుల ఆజ్ఞ అలాంటిది.

అతడేం చేస్తాడు ? మరొకడేం చేస్తాడు ? ప్రాచేతసుల ప్రకృతి అతి విచిత్రమైంది సుమా ! పాముల్లోనూ, జెఱ్ఱుల్లోనూ వుంటాడు. అతి భయంకరుడు.

శబరనాథుడు. పుణ్యకాలం గడిచిపోతూవుంది. త్వరగా చెప్పు, రెండో దేమిటి ?

అధిజ్యధన్వుడు. అవిటివాళ్ల జోలికి, స్త్రీ శిశువుల జోలికి వెళ్ళరాదు.

శబరనాథుడు. ఆఁ. అవిటివాళ్ళ జోలికి, అవిటివాళ్ళ జోలికి—మరేమన్నావు, స్త్రీ శిశువుల జోలికీనా ? మూడోది (రెండు వేళ్లు ముడుస్తాడు.)

శాంబరీభిల్లుడు. బందీలను తీసుకు రాగూడదు.

శబరనాథుడు. అంటే, ఊరికినే వదలిపెట్టాలిసిందే? ఒక్కొక్క లొత్తుకొడుకు మూడు చెరువుల నీళ్లు తాగిస్తాడే ! వాణ్ణి ఊరకనే వదల్లమే?

శాంబరీభిల్లుడు. చంపు.

శబరనాథుడు. ఒక్కసారిగా చంపితే పుణ్యాత్మునికంటె మంచి చావు చస్తాడే ! కాదు, చిత్రవధ చెయ్యాలి.

శాంబరీభిల్లుడు. ఎవరు కాదన్నారు ? శబరపల్లి పొలిమేరలోకి వచ్చేలోగా ఏమిచేసినా వద్దనేవారుండరు.

శబరనాథుడు. సరే, రెండు—బందీలను తీసుకు రాగూడదు.

శాంబరీభిల్లుడు. (నవ్వుతూ) మళ్లీ మొదటి కొచ్చా? మూడయ్యాయి.

శబరనాథుడు. మరచిపోయాను. ఇక నాలుగో దేమిటి ?

అధిజ్యధన్వుడు. బ్రాహ్మడైతే సరి - అవిటివాడయ్యేది, అనాథుడయ్యేది, సనాథుడయ్యేది, భాగ్యవంతుడయ్యేది, పేదవాడయ్యేది - నిలువునా చీల్చి చంపాలిసిందే.

శాంబరీభిల్లుడు. ఇదేదో కొత్తగావుందే !

శబరనాథుడు. నీ కల్పన కాదుగదా ?

అధిజ్యధన్వుడు. నీకు అన్నీ కొత్తగానే వుంటాయి. మనం వచ్చేటప్పుడు

మాధవశర్మగారు మాయాదేవిగారు చెప్పలా ?

శబరనాథుడు. ప్రాచేతసుల నోటిమీదుగా చెప్పినట్లు లేదే ?

శాంబరీభిల్లుడు. ప్రాచేతసుల ముందేగా వారిద్దరూ చెప్పింది ?

శబరనాథుడు. (అధిజ్యధన్వునితో) అరే అబ్బాయి! తెలీక అడుగుతాను; బ్రాహ్మలంటే ఎవరు? వాళ్ళకు రెండు తలకాయ లుంటాయా ఏమిటి ? వాళ్ళవిషయంలో అంతగట్టిగా చెప్పారు.

అధిజ్యధన్వుడు. రెండు తలకాయల సంగతేమోగాని రెండు నాలుకలు చూచినట్టుగా అనుమానం తగులుతూవుంది.

శాంబరీభిల్లుడు. అయితే నాగస్వరాన్ని ఇంటిదగ్గరే మరచి వచ్చావే?

శబరనాథుడు. దాన్ని తగలేసిరి. కాని అబ్బాయి, బ్రాహ్మణ్ణి కనుక్కోవడం ఎలాగు ?

అధిజ్యధన్వుడు. జంధ్య ముంటుంది.

శాంబరీభిల్లుడు. జంధ్యపుపోచ లేనివాడే లేడురా ?

శబరనాథుడు. గట్టి చిక్కొవచ్చింది, అందుట్లో వాళ్ళతలను తప్పకుండా తెమ్మన్నారు మాయాదేవిగారు.

శాంబరీభిల్లుడు. ఏ తల నరుక్కువెళ్ళినా కనుక్కోవచ్చారా ?

అధిజ్యధన్వుడు. ప్రాచేతసులంటే అంత తేలిగ్గా ఉంది !

శబరనాథుడు. కొంప ముంచేవు. ప్రాచేతసులు సర్వశాస్త్రాలు క్షుణ్ణంగా చదువుకొన్న బ్రాహ్మడురా. ఆవులిస్తే ప్రేవులు లెక్కెడతాడు.

శాంబరీభిల్లుడు. అయితే ఏం చేద్దాం ?

అధిజ్యధన్వుడు. దాని కొక ఉపాయం ఉందిగా. తొందరగా రండి. (త్వరత్వరగా ఎడమ ప్రక్కగా లోపలికి వెళ్తుతాడు.)

శబరనాథుడు. ఒకటి, రెండు, మూడు, నాలుగు, ఒకటీ, రెండు—

శాంబరీభిల్లుడు. తరువాత తీరిగ్గా లెక్కపెట్టు కుందువుగానిలే, రా. (చెయ్యి పట్టుకొని శాంబరీ భిల్లుడు శబరనాథుణ్ణి లాక్కువెళ్తుతాడు. మళ్లీ కొమ్ములు వినిపిస్తాయి. సిద్ధాంతి, అవధాన్లు, శాస్త్రి, శర్మ,

యింకా ముగ్గురు బాటసార్లు ఉంటారు. అందరూ కళవళపడుతూ వుంటారు.)

సిద్ధాంతి. (బిక్క మొహంతో) ఇంకేముంది అవధాన్లు! దొంగలు, దొంగలు! మా ఆవిడ యీ కుండలాలిమ్మని ఎంతో ప్రాధేయపడేది. ఈ సింహతలాటాలు చెడగొట్టించి తనకు నగలు చేయించమని ఎప్పుడూ మొత్తుకుంటూవుండేది. బర్రెను బాదినట్లు నాలుగుబాది ఇంట్లోపెట్టి గొళ్ళెంవేసే:వాణ్ణి కాని దానిగోడు చెవిని బట్టించుకోలేదు. ఇలా యీ సొమ్ము వీళ్ల ఎదాన కొట్టవలసి ఉంటే దానిగోడు ఎందుకు వింటాను బాబు!

అవధాన్లు. వెధవ డబ్బుకేంగాని, ప్రాణాలు తీస్తారేమో చూడవేం?

సిద్ధాంతి. దొంగలికి డబ్బు కావాలిగాని ప్రాణాలు దేనికి? వండుకు తింటారా?

అవధాన్లు. సొమ్ముకోసమే ప్రాణాలు తీస్తారు. నీ సింహతలాటాలు రాకపోతే, నీ చేతులు అంతవరకు తెగ నరుకుతారు.

సిద్ధాంతి. సీలలన్నా పెట్టించలేదు, ఎక్కడ జారిపోతాయోనని. అబ్బాయి, అవధాన్లు! రెక్క పుష్టి ఉన్నవాడివి. ఊడతీద్దూ!

అవధాన్లు. నీకేం అపకారం చేశాను? బాబూ నన్నుకూడ బతకనీ. వాళ్లు నీ సింహ తలాటాలను లాగివేయటం చూశారా ముందు నా అంతు కనుక్కుంటారు.

సిద్ధాంతి. అరే అబ్బాయి! నేను చూస్తూవుంటానుగా. బ్రాహ్మణ్ణి రక్షించరా. పుణ్యముంటుంది.

అవధాన్లు. నేనూ బ్రాహ్మణ్ణేనంటావా? కాదంటావా?

సిద్ధాంతి. శరీరం పరోపకారార్థమన్నారు.

అవధాన్లు. శరీరం ధర్మసాధనం అనికూడ పెద్దలు సెలవిచ్చారు. ఆ ముక్కగూడా చెప్పవేం!

సిద్ధాంతి. (చేతులు నులుముకుంటూ) నిత్యాగ్ని క్రియలు ఎలా జరుగుతాయిరా భగవంతుడా!

అవధాన్లు. మహా బ్రాహ్మడు బయులుదేరాడు. చూడండి. చూడండి (శాస్త్రి శర్మలు నవ్వుతారు.)

1 బ్రాహ్మణుడు. ఏమండోయ్! ఎవరినన్నా వదలుతారు కాని, బ్రాహ్మల్ని మాత్రం వదలిపెట్టరు. మీకు తెలీదా ఏమిటి?

2 బ్రాహ్మణుడు. తతిమ్మావాళ్ళకు డబ్బు మాత్రమే పోతుంది.

సిద్ధాంతి. వణకుతూ ఎవరన్నారు?

3 బ్రాహ్మణుడు. ప్రాచేతసుని దోపిడీలు బట్టబయలే. కొన్ని ధర్మాలను అతని అనుచరులు ఏమాత్రం జవదాటరు.

అవధాన్లు. మా కొంప నిలువునా నువ్వే తీశావు.

సిద్ధాంతి. ఆ రోజున కట్టుకట్టించి అతని క్రోధాన్ని ప్రజ్వలింప జేసింది నువ్వే.

సిద్ధాంతి. మాటలు కాస్త జాగ్రత్తగా రానీ. నీ బుద్ధి గడ్డి దినకపోతే నేనేం చేసేవాణ్ణి?

అవధాన్లు. (జంధ్యం బొడ్లో దోపుతూ) ఎవరి బుద్ధి గడ్డి తిన్నదో ఇప్పుడే తేలుస్తాను.

శాస్త్రి. అనవసరం. ఇప్పుడు పోట్లాడుకుంటే ప్రయోజన మేముంది. బ్రతికి బయటపడటాని కేమన్నా ఉపాయ ముందంటే చూడండి.

(ముగ్గురు బాటసారులు తమ బాకీ శాలను పొదల్లో పారేస్తారు. పడుచువాళ్ళిద్దరు పంచ చీర కట్టుకట్టి ముసుగులు వేసి కొంటారు. వయసుకొంచెం మళ్ళిన మూడో బాటసారి పక్క పొదల్లోనుంచి ఒక ఎండుకట్టెను పట్టుకొని కొంచెం నడుం వంచి వణుకుతూ వుంటాడు. మిగతా యిద్దరు బాటసార్లు అతని వెనక నిల్చుని గొంతుమార్చి)

కస్తూరిరంగ రంగా నాయన్న

కావేటిరంగ రంగా

అవధాన్లు. ఎవరోయ్ యీ ఆడవాళ్లు? (వెనక్కు తిరిగి ఆశ్చర్య పోతాడు.)

సిద్ధాంతి. బలే బలే. ఇదే బాగుంది. (గబగబా చీర కట్టుకట్టి ముసుగు పెట్టి బొక్కిసా చంకను పెడతాడు.) ఇదొకటే చాలదు. 'అధికస్య అధికం ఫలం' అన్నాడు శాస్త్రకారుడు. (ఎందుకైనను సంపాయించి నడుంవంచి వణుకుతూ గొంతుమార్చి)

కస్తూరిరంగ రంగా నాయన్న
కావేటిరంగ రంగా

అవధాన్లు. నాగతి ఏంకావాల్రా భగవంతుడా! యీ మగగొంతుతో భామవేషం ఎలా వేసేది? (అతనుగూడ ముసుగు పెడుతాడు. సిద్ధాంతి వంక చూచి) సిద్ధాంతీ ఆ ఉంగరానికి తిలోదకాలు ఇవ్వడలచావా ఏమిటి?

సిద్ధాంతి. అరరే మరిచిపోయాను ఏంచేసేటట్టు?

అవధాన్లు. ఈ బ్రాహ్మడికి దానం చెయ్యి. దాచుకుంటాడు.

సిద్ధాంతి. నేనే దాచుకొంటాను. (అని చేతిది లాక్కొని)

కస్తూరి రంగ రంగా నాయన్న
కావేటి రంగ రంగా

(నోట్లో ఉంగరం ఉంటంవల్ల సరిగ పలకదు)

అవధాన్లు. నోట్లో ఉంగరం బయటికొచ్చి పడేట్టు తంతారు.

సిద్ధాంతి. (భయంతో) అంతపని తప్పనట్లుంది (నోట్లోఉంగరం బయటికితీసి) నువ్వు పాట్టంలేదుగా, నీనోట్లో దాయ్.

అవధాన్లు. ఆ ఎంగిలి మంగలాన్ని నా నోట్లో దాచేదా?

సిద్ధాంతి. కాంతకీ కాంచనానికీ ఎంగిలి ఉందటోయ్ పిచ్చి బ్రాహ్మడా?

అవధాన్లు. కాంత కేమో గాని కాంచనానికి మాత్రం ఎంగిలి ఉంది. అయినా పెద్దవాడికోర్కె తీసెయ్యరాదన్నారు. (ఉంగరాన్ని అందుకొని తుడిచి ఊదుతూ ఉంటాడు.)

సిద్ధాంతి. ఆనక భయంతో మింగేశేవు. మింగినా కన్పించదటలే. జాగ్రత్త. ఎన్నో తరాల నుంచి వస్తూవుంది ఆ వుంగరం. ఈ రోజును దానికి ఆగతిపట్టింది......మళ్ళీ ఒకసారి చెబుతున్నా బ్రాహ్మడి సొమ్ము మింగావా చచ్చి ఊరుకుంటావు.

అవధాన్లు. నేనూ బ్రాహ్మణ్ణేగా

సిద్ధాంతి. వజ్రపు రవ్వ ఉందిరా. లోపలికి మింగావా చస్తావు.

అవధాన్లు. బాబో నాకు వద్దు. పారేస్తున్నా. ఇదిగో ప్రాప్తముంటే తరువాత దొరకొచ్చు.

సిద్ధాంతి. మింగకుండా చెయ్యటానికి అలా అన్నాను. వజ్రపు రవ్వ కాదు. (పారెయ్యబోతాడు.) గాయత్రి సాక్షి అది వజ్రపు రవ్వ కాదు. (అవధాన్లు ఉంగరాన్ని నోట్లో దాస్తాడు).

అవధాన్లు. (ఇదంతా చూస్తూ) శాస్త్రి! మనగతి ఏమిటి ? భామవేషం కట్టటమేనా ? మరేమన్నా సాధనముందా ?

శాస్త్రి. నే నా నీచత్వానికి ఒప్పుకోను.

శర్మ. బ్రాహ్మణున్ని చంపేస్తారట.

శాస్త్రి. అయితే శూద్రుణ్ణని చెప్పుకోమంటావా? ఛీ, దానికి నే నెప్పుడూ వొప్పుకోను.

శర్మ. ప్రాణాలు పోతాయి.

శాస్త్రి. పోతే పోతాయి. అతిపవిత్రమైనదని నమ్ముతున్న బ్రాహ్మణత్వాన్ని గంగలో కలుపుకో మంటావా? ఇంకా అలాంటి దుస్థితి నాకుపట్టలేదు. కావాలిస్తే నీవు బ్రాహ్మణ్ణి కానని చెప్పుకో.

శర్మ. నాకేనా అంత ప్రాణాలమీద తీపి? ఏమైనాకాని మన మిద్దరము బ్రాహ్మణులమే. విధి ఎలా తలచినా ఇష్టమే.

అవధాన్లు. వీళ్ళ తిక్క కుదురుతుందిలే సిద్ధాంతి!

సిద్ధాంతి. తప్పకుండా.

శాంబరీభిల్లుడు. ఏయ్ ఆగండి. అడుగు అవతలపెట్టారా, తలకాయలు ఆమడ దూరాన పడతాయి.

(శాంబరీభిల్లుడు, శబరనాథుడు, అధిజ్యధన్వుడు ప్రవేశిస్తారు. బాటసార్లు పాటమాని వేస్తారు. సిద్ధాంతి వినపడునట్లుగా ఇంకా పాడుతూనే వుంటాడు. శాస్త్రి శర్మలు అన్నిటికీ సిద్ధమై తెంపరితనంతో నిలబడతారు.)

శబరనాథుడు. చూశారా (కన్నుగొడతాడు శాంబరీభిల్లుడికి, అధిజ్యధన్వుడికి.)

శాంబరీభిల్లుడు. మొదట నావంతు.

శబరనాథుడు. అబ్బాయి! మొదట నేను. పైగా పెద్దవాణ్ణి (శాంబరీభిల్లుడు నిలబడిపోయి అధిజ్యధన్వుడు పొదల్లో వెనుకగుతూ వుంటాడు.) ఓరితొత్తుకొడుకా! ఎప్పు డేశావురా యీ వేషం. (వృద్ధబాటసారిని సిద్ధాంతిని ముడ్డిమీద తంతాడు. చేతికర్రలు టపీలున క్రిందబడతాయి సిద్ధాంతి చంకలోని బొక్కిసా దూరంగా పడుతుంది.)

సిద్ధాంతి. (గొంతుమార్చి) ఆడవాళ్లను తంతున్నావు కాదు. ప్రాచేతసులతో చెపుతాను.

శబరనాథుడు. చెప్పరా గాడిదా చెప్పు. (మరొక తన్ను తంతాడు.)

శాంబరీల్లుడు. ఇక నా వంతు. ఆగు. ఆడవాళ్ళంతా యీ ప్రక్కన నుంచోండి.

(అవధాన్లు, సిద్ధాంతి మిగతా యిద్దరు బాటసార్లు, ఓ ప్రక్కన నుంచుంటారు.)

శబరనాథుడు. అంత పొట్టా నువ్వా, ఆడదానివేనా ?

సిద్ధాంతి. కడుపుతున్నాను, తండ్రీ, అలా అనటం న్యాయం కాదు.

శబరనాథుడు. (శాంబరీ భిల్లునితో) అరేయ్, ముసలిముండ కడుపుతూ వుందట్రా. ఈ భాగవతం ఎక్కడన్నా విన్నావుట్రా ? (నాలుగుతన్ని సిద్ధాంతి చెయ్యిపట్టుకొని) బంగారపు ముద్దలు ! బంగారపు ముద్దలు ! (ముసుగులోనుంచి రెండుచేతులు బయటికిలాగి శాంబరీభిల్లునికిచూపించి రెండో ప్రక్కకు గట్టిగా విసురుతాడు, దూరంగా పోయిపడి)

సిద్ధాంతి. (ఏడుస్తూ) ఏదో బుద్ధి గడ్డితిన్నది, బాబు! రక్షించండి, బాబు రక్షించండి!

శబరనాథుడు. (ఈటె ఎత్తి) నోరు మూస్తావా? నోట్లో పొడవమంటావా? (కుక్కిన పేనులాగా సిద్ధాంతి ఉంటాడు. శాంబరీ భిల్లునితో) ఇక నీవంతు కానీ.

శాంబరీభిల్లుడు. మీరంతా కూచోండి. నుంచోండి. కూచోండి, నుంచోండి. (అందరి ముసుగులు జారతాయి, పిలకలు బయట పడతాయి) చూశావా శబరనాథా? ఈ రోజుల్లో ఆడవాళ్ళంతా పిలకలు పెట్టించుకుంటున్నారోయ్.

శబరనాథుడు. మగవాళ్ళకన్నా ఆడవాళ్లు తక్కువ తిన్నారా యేమిటి?

శాంబరీభిల్లుడు. తొత్తుకొడుకుల్లారా! వీళ్ళంతా గుడ్డివాళ్ళనుకున్నావా. తలొక వంద గుంజీళ్లు తియ్యండి. (అలాగే తీస్తువుంటారు. ఆతురతతో అవధాని నోట్లోని ఉంగరాన్ని మరొక ప్రక్కకు మార్చబోతాడు. శాంబరీభిల్లుడుచూచి) ఓరి తొత్తుకొడుకా! తియ్యి బయటికి తియ్యి.

అవధానులు. ఏం (నిల్చుని) ఏమిటి? (అని మింగబోతాడు.)

శాంబరీభిల్లుడు. మింగావా చచ్చావే? తియ్యి బయటికి. (అవధాని నోట్లోనుంచి ఉంగరం తీస్తాడు) పంచెతో తుడిచి యిలా తే? (గత్యంతరంలేక ఉత్తరీయంతో తుడిచి యిస్తాడు. ఇంతలో అధిజ్యధన్వుడు బాటసార్లు పారేసిన మూడు బొక్కిసాలూ పట్టుకొస్తాడు.)

అధిజ్యధన్వుడు. ఓరి గాడిదల్లారా! ఎంత యిబ్బంది పెట్టార్రా? మీ దగ్గరున్నవన్నీ ఇలా తీసుకురండి. (శాస్త్రి శర్మలు, తమ దగ్గిరున్న కొలది రొక్కాన్ని, అధిజ్యధన్వుని చేతిలో పోస్తారు. బాటసార్లను చూచి) ఏం నుంచున్నారే? ఇలా తీసుకురండి!

బాటసారులు. మా దగ్గర ఏమీలేవు.

అధిజ్యధన్వుడు. అయితే మీరే నన్నమాట యీ బొక్కిసాలను పొదలో పారేసింది.

(సిద్ధాంతిని అవధాన్ని చూచి) అలా తాడి చెట్లల్లాగా నుంచున్నారేం ?

సిద్ధాంతి. నా దగ్గర మిగిలింది ఈ రెండే (రెండు చేతులెత్తి సింహతలాటాలు చూపుతాడు.)

అధిజ్యధన్వుడు. శబరనాథ్ ! ఆ చేతులు రెండూ నరికి తీసుకురా. (శబరనాథుడు నరకబోతాడు)

సిద్ధాంతి. రక్షించండి, రక్షించండి, చేతులు నరికితే మీకేం వస్తుంది ? వీటిని తీసుకోమంటిని గదా ! (శబరనాథుడు పగలదీసి రెండుచేతుల సింహతలాటాలు తీసికొని అధిజ్యధన్వుడి కిస్తాడు.)

అధిజ్యధన్వుడు. డబ్బంతా వసూలైనట్లేనా ?

శాంబరీభిల్లుడు. వాడిదగ్గర ఉంగర మొకటి దొరికింది. ఇంకా ఏమన్నా ఉన్నాయేమో చూడాలి.

అవధానులు. నా డబ్బుకూడ ఆయనగారి (వేలితో సిద్ధాంతిని చూపుతు) బొక్కిసాలో ఉంది.

అధిజ్యధన్వుడు. (శబరనాథునికి శాంబరీభిల్లుడికి కనుసైగచేసి) ఇక వెళ్లుదాం పదండి !

(కొంతదూరం వెళ్లుతారు.)

అధిజ్యధన్వుడు. మీలో బ్రాహ్మలెవరన్నా ఉంటే యీ సింహతలాటాలను తీసికోండి. (మొదట సందేహిస్తారు. తరువాత అవధానులు సిద్ధాంతి, వారి వెనుకాల శాస్త్రీ, శర్మ వెళ్లుతారు.)

అధిజ్యధన్వుడు. (సిద్ధాంతినిచూచి) నీవు బ్రాహ్మడివేనా ?

సిద్ధాంతి. నిజంగానండి ! ఇదిగో జందెంకూడ. (బొడ్లోనుంచి తీస్తాడు.)

అవధానులు. అందుకు సందేహమా ! (జందెం కోసం వెదుకుతు) క్షమించండి, ఇందాకటి హడావుడిలో తెగిపోయినట్టుంది.

అధిజ్యధన్వుడు. బ్రాహ్మడివని నమ్మటమెట్లా ?

అవధానులు. అయితే బుక్కు చదువుతాను.

ఓం శన్నో దేవీ.

అవధానులు. ఛీ! దరిద్రుడా! డబ్బుకోసమని వేదాన్ని అపవిత్రం చేస్తావా?

అధిజ్యధన్వుడు. వీళ్లేరా బ్రాహ్మలు పట్టుకోండి.

శాంబరీభిల్లుడు. (అవధాని సిద్ధాంతుల పిలకలు పట్టుకుంటాడు) వీళ్లు పెట్టిన బాధ అంతా ఇంతా కాదు.

శబరనాథుడు. గడ్డు సమస్య తేలిపోయింది. యీ నాలుగు తలకాయల్ని తీసుకెళ్ళుదాం పదండి.

(శాంబరీభిల్లుడు పిలకలు పట్టుకుని వెళ్లుతూవుంటాడు. ఆ వెనక శాస్త్రిశర్మలు, వారి వెనుక శబరనాథుడు అధిజ్యధన్వుడు వెళ్ళుతారు.)

(తెర జారుతుంది.)

— వాల్మీకి నుంచి 43 డిసెంబరు.

—

స్వర్గమా, నరకమా?

పాత్రలు

*

వర్మ

వేదాద్రి

*

[యుద్ధరంగం. శవాలు కుప్పతిప్పలుగా పడివుంటాయి. వర్మ సైనికులతో కలిసి ఉన్నంతకాలం తీవ్రంగా పోరాడాడు. వారు పారిపోవటమో, చనిపోవటమో జరిగేటప్పటికి అత డొక్కడే మిగిలాడు. మళ్ళీ వాస్తవిక జగత్తు ఒకసారి అతనికి గోచరించింది. ఎక్కడలేని భయం కలిగింది. మెల్లగా శవాలు పోగుచేసి వాటిని మీద వేసుకొని పండుకున్నాడు. ఆ భయోద్వేగంవల్ల కొంత స్పృహతప్పి పడివుంటాడు. అతడెంత సేపు అలావున్నాడో తెలియదు. పూర్తిగా స్పృహ వచ్చేటప్పటికి అమిత దాహం కలుగుతుంది.

ఇంకా దూరాన్నుంచి ఫిరంగుల మోత వినిపిస్తూనే వుంటుంది. చెదురాటుగా తుపాకీ గుండ్లు దూసుకొని వస్తూనే వుంటాయి.]

వర్మ. దాహం, దాహం!

అవ్యక్తస్వరం. అదిగో నెత్తురు మడుగు, దప్పిక తీర్చుకో.

వర్మ. (మెల్లగా) చచ్చానురా! మనుష్యుడైతే మానవరక్తాన్ని తాగమంటాడా? ఏదో పెనుభూతం!

అవ్యక్తస్వరం. దాహ మన్నవాడివి మెదలకుండా పూరుకున్నావేం?

వర్మ. (మెల్లగా) ఇది నామీదనే వున్నట్లుంది. ఈ గడియతోనే నూరేళ్ళు నిండాయి! ఈ నెపంతోనన్నా దాన్ని కొంతదూరం సాగనంపితే, అవతల ఎటుపోయి ఎటువస్తుందో. (పెద్దగా మూలుగుతూ) బాబూ, లేవలేకుండా ఉన్నా. కాస్త నీదోసిటితో—

అవ్యక్తస్వరం. (మెల్లగా) ఇదేదో దయ్యంలాగావుంది. లేకపోతే రక్తం తాగుతా నంటుందా? అయితే పూజ్యులు దయ్యాలు లేవన్నారే! అయినా కాస్త టోలాయిస్తే. (పెద్దగా) దేవతలు రక్తం ముట్టుకోరు.

వర్మ. అయితే నీవు అమరుడవా?

అవ్యక్తస్వరం. ఆఁ.

వర్మ. ఇంకేం! ఇది స్వర్గము.
అవ్యక్తస్వరం. ఊఁ.
వర్మ. అయితే ఇంత చీకటి బుయ్యారంగా ఉందేమిటి?
అవ్యక్తస్వరం. రాత్రి.
వర్మ. అలాగా! ఈ ధ్వని ఏమిటి? (తలకొంచెం పైకి ఎత్తుతాడు. తుపాకి గుండు బుస్సున తలపాగాలోకుండా దూసుకుపోతుంది. అంతలోనే తల వంచుకుంటాడు.)
అవ్యక్తస్వరం. అబ్బే యేమీలేదు. మన్మథుడు పుష్పబాణాలు సంధిస్తూ వున్నాడు. అవే రివ్వురివ్వున గాలిలో దూసుకుపోతున్నాయి.
వర్మ. మన్మథబాణాలు ఇంత రణగుణ ధ్వనిచేస్తాయా?
అవ్యక్తస్వరం. గుండెల్ని చీల్చివేస్తాయి. అలాంటప్పుడు యీ ఘోష బయలుదేరక ఏమవుతుంది?
వర్మ. మరి టపటపా పడుతున్నాయేమిటి?
అవ్యక్తస్వరం. యుద్ధరంగాన్నుంచి ఎకాయెకిని వస్తున్న వీరులమీద అప్సరసలు పుష్పవర్షం కురిపిస్తున్నారు.
వర్మ. అలాగా! అయితే యీ లోకంలో ఆడవాళ్ళు అద్దూపద్దు లేకుండా కంటికి కనిపించిన ప్రతివాడితో యిలా సరసాలాడుతా రన్నమాట!
అవ్యక్తస్వరం. ఏమిటీ! నీవీ స్వర్గలోకం వాడివి కాదట్లుందే!
వర్మ. మాది భూలోకం లెండి.
అవ్యక్తస్వరం. అలా చెప్పు మరి!
వర్మ. సరే కాని బాబూ! ఇది స్వర్గలోకమేనా?
అవ్యక్తస్వరం. ఆహా.
వర్మ. అయితే ఈ లోకంలో ఆకలి దప్పులుండ వంటారే?
అవ్యక్తస్వరం. ఉండవు.
వర్మ. నాకు నాలుక పీక్కుపోతూవుందే?
అవ్యక్తస్వరం. అయితే నీకు భూలోకంలో నివాపాంజలి ఇచ్చివుండరు.

వర్మ. ఇవ్వకపోవటమేమిటి ? అసంభవం. తప్పకుండా ఇచ్చివుంటారు. మాది కర్మభూమి.

అవ్యక్తస్వరం. కర్మభూమి అయితే కావచ్చును. కాని నీకు మాత్రం నివాపాంజలి యిచ్చి వుండరు.

వర్మ. మా రాజవంశ మున్నంతకాలం అలా జరగటానికి వీలులేదు. ఆ వంశం పేరు చెబితే చాలు; గడ్డి పరకసహితం నిలబడిమాట్లాడుతుంది. ధర్మం నాలుగు కాళ్ళా నడుస్తుంది.

అవ్యక్తస్వరం. అది పశువన్న సంగతి తెలియదులే. కాని నీవు భూలోకాన్ని వదలి వచ్చావని ఎవరికి తెలుసు ?

వర్మ. వచ్చేటప్పుడు మా చిరంజీవితో మరీ మరీ చెప్పివచ్చాను. నేను బ్రతికివున్నా, లేకపోయినా నివాపాంజలి విడవమన్నాను. అలాంటి మంచివాడు మరొకడుండడు.

అవ్యక్తస్వరం. అతనికేమి ప్రమాదం సంభవించిందో ! లేకుంటే నీకీ అగచాట్లు ఎందుకొస్తాయి ?

వర్మ. మా ముసల్దయినా వూరుకుంటుందా ? దానికి నేనంటే ఎంతో ప్రాణం. నా కిలాంటి దుర్గతి వస్తుందని తెలిసికూడా ఎలా వూరుకొంటుంది ?

అవ్యక్తస్వరం. ఆమె కెలావుందో ?

వర్మ. (ఆలోచిస్తూ) నిజమే. ఇంటెలపాదీ ప్రమాదమే. భగవంతుడా, ఎంత కర్మ పట్టిందిరా ! అరాజకం పెరిగిపోతున్న యీ రోజులలో ఏ నిమిషంలో ఏమి జరిగినా ఆశ్చర్యపడ నక్కరలేదు. అయినా రాజుగారు ఉన్నారు. యుద్ధరంగంలో చనిపోయిన సైనికులకు నివాపాంజలి ఇస్తూవుంటానికి ప్రత్యేకంగా బ్రాహ్మల్ని నియమించారు. అవి అయినా చేరి వుండాలిసిందే !...ఇక్కడ అధికారు లేమన్నా.........

అవ్యక్తస్వరం. ఏమిటీ, లంచాలు పుచ్చుకొంటారనా ?

వర్మ. ఎందుకు కోపం బాబు ! అలవాటయిన ప్రాణాలు కాదు ?

అవ్యక్తస్వరం. [నవ్వుతూ] నివాపాంజలి అంటే అంత తేలిక అనుకు న్నావా ? మంత్రపూతం సరిగ్గా నిర్దిష్టవ్యక్తికే చేరుతుంది. మళ్లీ ఇంకె వ్వడన్నా అపహరించడానికి ప్రయత్నించాడా గొంతు పట్టు కొంటుంది.

వర్మ. అయితే ఎందుకు రాలేదంటూ ?

అవ్యక్తస్వరం. అసలు నీవు చచ్చిపోయావని బ్రాహ్మణుల కెలా తెలుస్తుంది ?

వర్మ. ప్రతిరోజు యుద్ధంలో చనిపోయిన సైనికులను లెక్కకట్టించి వారి పేర్లు, కులగోత్రాలు త్రవ్వించి ఆ మీదట నివాపాంజలి ఇవ్వ టానికి రాజుగారు కట్టడిచేశారు.

అవ్యక్తస్వరం. రోజురోజు అసంఖ్యాకంగా సైనికులు చచ్చిపోతు న్నారు. ఈ సంఖ్య అంతా బట్టబయలైతే ప్రజల్లో ఆందోళన బయలు దేరదూ ? అందువల్ల అందరికీ నివాపాంజలి ఇచ్చి ఉండరు.

వర్మ. ఇంతకూ దప్పికతో ఇలా అల్లాడిపోవలసిందే నన్నమాట. అబ్బబ్బ! ఇది స్వర్గం కాదు. నరకంలాగా ఉంది... బాబూ, బాబూ ! పుణ్య ముంటుంది. ఇన్ని నీళ్ళు గొంతులో పోద్దూ.

అవ్యక్తస్వరం. స్వర్గంలో ఉన్నవాడికి ఇంకా పుణ్యమెందుకు ? ఈ రంభా మేనకాదుల్ని వదలిపెట్టి ఏ పాడులోకానికో పోవాలి. నీకు నీళ్లు పొయ్యనూ పొయ్యను, ఆ పాడు లోకానికి నేను పోనూ పోను.

వర్మ. ఛీ ఛీ! ఏమి లోకం ! చస్తేనన్నా బాగుంటుంది.

అవ్యక్తస్వరం. అయితే చావరాదు ? ఎవ రడ్డపడ్డారు ?

వర్మ. ఇంతకూ ఇది అమరలోకం కాదన్నమాట !

అవ్యక్తస్వరం. [మాట్లాడదు.]

వర్మ. ఏం పలకవేం ! ఇది స్వర్గం కాదు. ఇంతసేపు యీ ముసలివాడితో పరిహాసాలాడుతున్నావా ? నీ తలకాయ నరికివేస్తా.

అవ్యక్తస్వరం. అంత మగసిరి వుంటే యీ శవాల్లో ఎందుకు దాక్కుంటావులే?

వర్మ. నాకా భయం? మా సేనాపతన్నా ఆమాట అనలేదు. పైగా ఎన్ని బంగారు పతకాల్ని బహుమతిగా సంపాదించానో తెలుసా?

అవ్యక్తస్వరం. ఏదీ, ఒక్కటికూడా కనిపించదే?

వర్మ. [మెల్లగా] ఓరి వెధవా, నన్ను ఒకకంట కనిపెడుతూ నేవున్నావన్నమాట! [పెద్దగా] వాటిని ఇంటి దగ్గర దాచివచ్చాను. మీలాంటి పిరికివాళ్ళు యుద్ధంలో ఎదురౌతా రని నాకేం తెలుసు?

అవ్యక్తస్వరం. ఇంకేం! ధైర్యాన్నికూడ ఇంటిదగ్గరే భార్యకు కాపలా పెట్టి వచ్చి వుంటావు.

వర్మ. కళ్ళు తెరవని పసికూంకలకుకూడ పెద్దవాళ్ళంటే ఎంత తేలిక, ఎంత తేలిక! నేనే పిరికివాణ్నయితే అన్ని బంగారు పతకాలు ఎందు కిస్తారు?

అవ్యక్తస్వరం. పారిపోయినందుకు.

వర్మ. పారిపోయిన సైనికుడికి బహుమతా? ఎవరన్నా వింటే నవ్విపోతారు.

అవ్యక్తస్వరం. నీవు మాంధాతకాలంలో ఉన్నట్లుంది. ఇప్పటి యుద్ధతంత్రాల సంగతి తెలియదు కామాలు. సైన్యం ఎంత తొందరగా, ఎంత నష్టం లేకుండా పారిపో గలిగితే అంతలాభం. వెంటబడీ తరుముకొనివచ్చే శత్రువు అంత తొందరగా అలసిపోతాడు. ఆ హడావుడిలో పరికరాల్ని వదలిపెట్టి వట్టి చేతుల్తో వుంటాడు.

వర్మ. అదంతా నాకు తెలీదు. నాకు మాత్రం నా ధైర్యసాహసాలకు మెచ్చుకొని బంగారు పతకాలిచ్చారు.

అవ్యక్తస్వరం. నీకే ధైర్యముంటే యీ నరకయాతన ఎందు కనుభవిస్తావు. ఈ మురిగిపోతున్న శవాల మధ్య, రోజుల పర్యంతం ఈ దుర్గంధంలో అన్నానికీ, నీళ్ళకూ రోసి ఇలా పడి వుంటావా? నేరుగా వెళ్ళి

ఎదురు రొమ్మొడ్డి జయాన్నో, మృత్యువునో చూరగొంటావు.

వర్మ. (విషాదంగా) నిజమే నాయనా! ఇంకా యీ ముసలివాడు యీ లోకంలో అనుభవించవలసింది ఏ ముంది? కాని...కుంకుమ రేఖ మాసిపోతే మా ముసలిదాని ముఖం ఎంత చిన్నబోతుందనుకున్నావు? నా కళ్ళు గిర్రున తిరిగి ఊడిపడవు?

అవ్యక్తస్వరం. (గట్టిగా నవ్వుతూ) చచ్చిపోయినవాళ్ళు బ్రతికినవాళ్లను ఎప్పుడూ చూస్తూనే ఉంటారు కామాలు!

వర్మ. అదికాదు. పొరబడుతున్నావు. చావంటే నేను గజగజ వణకి పోయే వాణ్ణికాదు. కాని...అది పసిది. నాలుగేళ్ళపాటు ఆ లేత ముఖం కుంకుమ రేఖతో కళకళలాడుతూవుంటే ఎంత బాగుంటుం దనుకున్నావు! నువ్వు చూచి ఉంటే ఇలాంటి మాట అనవు.

అవ్యక్తస్వరం. తాటిచెట్టు లాంటి కొడుకున్నాడని ఇంతకు ముందేగా చెప్పింది.

వర్మ. ఎప్పుడు?

అవ్యక్తస్వరం. యుద్ధానికివచ్చే ముందు అన్ని అప్పగింతలు పెట్టి వచ్చా నన్నావు కాదు?

వర్మ. కాదని ఎవరన్నారు?

అవ్యక్తస్వరం. నీ కొడుకు చిన్నవా డయితే అన్నీ వైనవైనాలుగా ఆఖరికి నివాపాంజలితో సహా మరచిపోవద్దని ఎలా హెచ్చరించావు?

వర్మ. అవును, మా అబ్బాయి మాకు చిన్నవాడు కాక పెద్దవా డవు తాడా?

అవ్యక్తస్వరం. ఆ అబ్బాయి తల్లి చిన్నదా, పెద్దదా?

వర్మ. చిన్నదే, నిజంగా పసిపాప. రెండో సంబంధం. అచ్చటా ముచ్చటా ఏమీ ఎరగదు. కళ్లన్నీ నా మీదనే పెట్టుకున్నది.

అవ్యక్తస్వరం. రెండో పెళ్లిచేసుకొన్న వాడివి మూడో దాన్ని కట్టు కోటానికి ఏ మాత్రం సంకోచ పడనక్కరలేదు. ఈ పుణ్యక్షేత్రమైన

9

యుద్ధంలో చచ్చిపోతే రంభా మేనకాదులు నే నంటే నేను, నాకు కావాలంటే నాకు కావాలి, అని వత్సందాలతోవచ్చి పైన బడతారు.

వర్మ. అదే చిక్కు. అందరి అప్సరసలతో నేనెలా వేగేది? పడుచు వాణ్ణన్నా అయితే ఎలా గుండేదో ?

అవ్యక్తస్వరం. ఆ భయమేమీ అక్కరలేదు. నీ కిష్టమైన దాంతో నే కాపరం చెయ్యొచ్చు. ఎవ్వరూ కాదనరు.

వర్మ. మా ముసలిదాని సంగతో మరి ?

అవ్యక్తస్వరం. అంటే మీ మొదటి భార్య సంగతేనా ?

వర్మ. అబ్బబ్బా! ఏం పిదపకాలం ... మా పసిదాని సంగతి.

అవ్యక్తస్వరం. నీకు ఒక కూతురుకూడా ఉందా ?

వర్మ. కాదురా బాబు ! మా యింటావిడ.

అవ్యక్తస్వరం. అలా చెప్పరాదు ? ఇలా యేడ్పించకపోతే ? ఆవిడకేం మహాలక్ష్మి లాగ బంగారు పతకాలు అమ్ముకొని సలక్షణంగా కాలం గడుపుతుంది.

వర్మ. బంగారు పతకాలా ? ఎవ రిచ్చారు ?

అవ్యక్తస్వరం. యింతకు ముందేగా నీవు చెప్పింది. యుద్ధాల్లో ఎన్నో బంగారు పతకాలు సంపాయించానని.

వర్మ. లేదు. నేనెలాచెప్పి ఉంటాను ? యుద్ధ రంగాల్లో బంగారు పత కాలు పుట్టుకొస్తాయా ఏమిటి ? అయినా మా ముసలిదాని సంగతి నీకు తెలీదు. ఎప్పుడన్నా కొస్త ఆలస్యంగా ఇంటికి వెళ్ళితే ఎంత గొడవచేస్తుం దనుకొన్నావు ? నన్ను చూడనిదే ఒక్క నిమిషం వుండ లేదు. పైగా నేను రంభ దగ్గరున్న సంగతి తెలిస్తేనా ? అయ్యో చచ్చాను ! దాని ప్రసన్న వీక్షణం ఎంత సమ్మోహనంగా ఉంటుందో, దానికోపం అంత భయంకరంగా ఉంటుంది. అలాంటి దాన్ని నేనెలా విడిచిపెట్టివెళ్లేది ? ఇరుగు పొరుగు వారంతా అదంటే ప్రాణాలు విడుస్తారు. వాళ్ల నడిగితే అది ఎంత మంచిదో తెలుస్తుంది.

అవ్యక్తస్వరం. ఆమె కలవాటైనవాళ్ళకు కాక పరాయివాళ్ళ కామె మంచి తన మెలా తెలుస్తుందిలే.

వర్మ. ఇప్పుడు కూసిన కూత మళ్లీ కుయ్యి?

అవ్యక్తస్వరం. (నవ్వును ఆపుకొని) ఎందుకు అంత కోపం? నే నే మన్నాను? ఆమె మంచితనానికి అలవాటుపడ్డ వాళ్లకు ఆమె మంచితనం తెలుస్తుందన్నాను. ఇందులో తప్పేమిటి?

వర్మ. అబ్బా! దాహం దాహం!

అవ్యక్తస్వరం. నే నిందాకే దారి చూపించాను.

వర్మ. చావమంటావు. అంతేగా!

అవ్యక్తస్వరం. ఇలా బాధపడేకంటె హాయిగా కాలుమీద కాలు వేసుకొని, ఆ రంభ అలా ఆకుమడుపులు అందిస్తూవుంటే, ఆ సన్నని పొడుగాటి వేలిని అలా లీలగా కొరికితే, మొగం చిట్లించుకొని ప్రయత్నం మీద కోపం తెచ్చుకొని ఆవిడ ఒక్క కమ్మనిచూపు అలా పారవేస్తే ఎంత బాగుంటుంది?

వర్మ. నిజమే, కాని ......

అవ్యక్తస్వరం. ఏడ్చినట్లే ఉంది. అ రంభాకేళిలో ఆనందంలేదని ఎవ్వడంటాడు? కొమ్ములు తిరిగిన వేదాంతులుకూడ విషయికానందాన్ని ఒప్పుకున్నారు.

వర్మ. నేను కాదనటంలేదే! కాని నా పెద్ద భార్య సంగతే ఆలోచిస్తూవున్నా.

అవ్యక్తస్వరం. ఆవిడకు అక్కడేం పని? అక్కడి కెందుకు వస్తుంది?

వర్మ. స్వర్గలోకంలో కాక అది ఎక్కడ వుంటుందంటా? నరకానికి పోతుందంటావా? ఎప్పటికిపోదు. మహాపతివ్రత. కాదన్నవాళ్ళ నోట్లో పురుగులు పడతాయి. పైగా చచ్చిపోయిం తరువాత సువర్ణదానం, గోదానం, భూదానం ఒక్కటేమిటి అన్నిదానాలు చేశాను. అలాంటప్పుడు అది నరకానికి ఎలాపోతుంది? తప్పకుండా స్వర్గానికి చేరి ఉంటుంది.

అవ్యక్తస్వరం. చేరితే నీకేం ?

వర్మ. మహాబాగా చెబుతున్నావు. అమాంతం మీదపడి గొంతు నులిమేస్తుంది. ఇంకొకపెళ్లి చేసుకుందికాక ఇక్కడకూడ నా ముందు నా కళ్ళయెదుట ఇలా ఊరేగుతావా అంటుంది.

అవ్యక్తస్వరం. మహాపతివ్రత అని ఇంతకుముందేగా చెప్పింది ?

వర్మ. కాదని ఏ దరిద్రు డంటాడు ?

అవ్యక్తస్వరం. ఆవిడ చనిపోయి నాలుగయిదు సంవత్సరాలయింది కాదు ?

వర్మ. అవును.

అవ్యక్తస్వరం. ఇన్ని సంవత్సరాలనుంచీ ఆవిడ స్వర్గంలో ఏమిచేస్తూ వుంటుంది ? హా ప్రియా! ఓహో ప్రియా! ఎప్పుడు వస్తావు ? నువ్వెప్పుడు చస్తావు ? అని ఎదురుచూస్తూవుంటుందా ? అంటే నువ్వెప్పుడు చస్తావు ? అని కనిపెట్టుకొని కూర్చుంటుందా ?

వర్మ. నోరు ముయ్యి. పతివ్రత భర్తచావుకోసం కనిపెట్టుకు కూర్చుంటుందా ? అలాంటిదైతే, అది పతివ్రతా కాదు; స్వర్గంలోనూ ఉండదు. ఏ నరకజ్వాలల్లోనో మ్రగ్గిపోతూ వుంటుంది.

అవ్యక్తస్వరం. ఇంతకూ నీభార్య పతివ్రతేగా, అందువల్ల ఆవిడ స్వర్గలోకంలోనే ఉండి ఉండాలి.

వర్మ. తప్పకుండా అంతే.

అవ్యక్తస్వరం. అయితే నీకోసం ఎదురుచూస్తూవుండదు. అంతేనా, ఇందులో సందేహముందా ? పైగా స్వర్గంలో వార్ధకం, వావి-వరుసలు ఉండవని చెప్పనే చెప్పారు. ఉంటే రంభా మొదలైనవారు ఎవడు యుద్ధంలో చస్తాడా, యెవడు యజ్ఞంచేసి వస్తాడా, అని యెదురు తెన్నులు చూస్తూఉండరు. కాబట్టి ...... మీ

వర్మ. శచీదేవికూడా అలాంటిదేనా ?

అవ్యక్తస్వరం. ఆవిడ దేవేంద్రుని భార్య.

వర్మ. మరి అది నా పెళ్ళాంగా ?

అవ్యక్తస్వరం. నీవు దేవేంద్రునిలాంటి అధికారివి కావుగా ?

వర్మ. టట్, ఇదంతా అబద్ధం. ఇష్టం వచ్చినట్లు కల్పించి వ్రాశారు. ఇలా చెడబరికేటప్పుడు వాళ్ల భార్యలు జ్ఞాపకంరాలేదు. జ్ఞాపకం వచ్చిఉంటే ఇలా అంకథండాలం వ్రాసివుండరు.

అవ్యక్తస్వరం. ఇంతకూ అంతా అబద్ధమే నంటావు.

వర్మ. ఆహా! అందువల్ల యుద్ధభూమిలో చచ్చినా ఒకటే; రేపు తీరిగ్గా ఇంటిదగ్గర చచ్చినా ఒకటే.

అవ్యక్తస్వరం. ఎప్పుడుచచ్చినా ఒకటే అయినప్పుడు ఇప్పుడే ఎందుకు చావగూడదు ? ఈ బాధ తప్పుతుంది.

వర్మ. ఏదో శనిగ్రహం పట్టుకుందిరా బాబు. నీవు మానవుడి మాదిరిగా లేవు. నా చావుకు కనిపెట్టుకు కూర్చున్నావేమంట ! నేను చచ్చిపోతే నీ కేమి వస్తుంది ? నేను భాగ్యవంతుణ్ణికాదు. నీవు నా జ్ఞాతివీకాదు. ఒకవేళ దగ్గర జ్ఞాతివైనా, నా అప్పులు నా కుటుంబ భారాన్ని పంచుకోవలసిందే తప్ప నీకు ఒరిగేది ఏమీలేదు.

అవ్యక్తస్వరం. శత్రువు చచ్చిపోవటం ఇష్టంకాదా ?

వర్మ. (ఉలిక్కిపడి) నాకు జ్ఞాపకం వున్నంతవరకు నీకుగాని, మీ వాళ్లకుగాని అపకారం చెయ్యలేదు. ఇంతవరకూ కూడా మనం ఒకరి ముఖం ఒకరు చూచుకోలేదే! అలాంటప్పుడు నామీద నీకుగాని, నీ మీద నాకుగాని కోపం ఉంటానికి ఎలా వీలుపడుతుంది ?

అవ్యక్తస్వరం. నిజమే, కాని మా మీదికి ఎందుకు కత్తిదూశావు ? ఎవరిమీద పగతీర్చుకోటానికి వచ్చావు ? స్వర్గం అలంకరిస్తా నంటావా ? అది లేదని నీవే చెప్పుకున్నావు.

వర్మ. నిజమే (నిట్టూర్చి) పొట్ట...ఈ పాపిష్ఠిపొట్ట. నన్నేమి చెయ్యమంటావు ?

అవ్యక్తస్వరం. అయితే నీ రాజుతో కలిసి ఎవరిపైకి కత్తి దూశావో

తెలుసా ?

వర్మ. అబ్బబ్బా! ఏమిటి ఈ ధ్వని ?

అవ్యక్తస్వరం. రివ్వుమనేవి గాలిలో దూసుకుపోతున్న తుపాకి గుండ్లు. ఆహారం కోసం వచ్చి గుండ్ల దెబ్బలు తిని నక్కలు అర్చి చస్తున్నాయి. మాంసం కోసం రాబందులు ఆకాశంలో చక్రాలు కొడుతున్నాయి. అదను దొరికినప్పుడల్లా మాంసఖండాలను తన్నుకు వెళ్లుతూ తుపాకీ గుండ్లకు బెదరి వాటిని జారవిడుస్తున్నాయి.

వర్మ. ఇక దిక్కేముంది ? బ్రతికి బయటపడటం కల్ల.

అవ్యక్తస్వరం. మరేమనుకున్నా ?

వర్మ. ఈ పక్షులకు, ఈ జంతుజాలానికి ప్రాణభయం లేదంటావా ?

అవ్యక్తస్వరం. లేకేమి ?

వర్మ. ఉంటే యీ ప్రమాదకరమైన స్థలానికి ఎందుకు వచ్చాయి ?

అవ్యక్తస్వరం. నువ్వెందుకు సైన్యంలో చేరా ? ఈ ప్రజ యెందుకు యుద్ధానికి దిగింది ?

వర్మ. నేనేదో దౌర్భాగ్యుణ్ణి. ఆ పక్షులకేం ? ఆ నక్కలకేం ? ఏ గ్రామాల్లోనో, ఏ అరణ్యాల్లోనో పొట్టపోసుకోవచ్చునుగదా ?

అవ్యక్తస్వరం. గ్రామాల్లో ఏముంది? పైరా, పంటా? అంతా క్షామం. ప్రజలే తుంగగడ్డలు, రక్కస గుబ్బలు, ఈతగుంజు, పక్షులు—ఒక టేమిటి? తిన గూడనివాటికిగూడా ఎగబడ్డారు. అలాంటప్పుడు ఇతర ప్రాణుల సంగతి చెప్పాలా ?

వర్మ. ఆకలిబాధవల్లనే యీ తిరుగుబాటు వచ్చిందన్నమాట.

అవ్యక్తస్వరం. లేకపోతే వీరస్వర్గాన్ని చూరగొందామని చేస్తున్నా రంటావా ? ఒక్కడైతే ఏ అధికార పిపాసతోనో యుద్ధానికి దిగ వచ్చును. కాని ప్రజలంతా ఇలా తెగబడి యుద్ధానికి దిగుతా రంటవా? దిగినా ఇంత తెంపరితనముతో పోరాడుతారంటావా ?

వర్మ. ఎంత దారుణం! ఎంత దారుణం!

అవ్యక్తస్వరం. రేపు నీ గతి, యింతకన్న భిన్నంగా ఉంటుందన్న నమ్మకముందా? యుద్ధానంతరంకూడా నిన్నిలాగే మేపుతా రనుకుంటావా?

వర్మ. అంతే!

అవ్యక్తస్వరం. అంతగాక మరే మనుకున్నావ్? స్వర్గం, నరకం, కర్మం, సనాతన ధర్మం అనే పేరుతో కాస్తో కూస్తో నోటి కందించి మీ వంటి వాళ్ళనంతా ఇలా యుద్ధానికి తోలుతున్నారు. అన్నెమూ పున్నెమూ ఎరుగని మిమ్మల్ని మృగాలవలె ఇలా వేటాడుతున్నారు.

వర్మ. మాకడుపుల్ని మేమే చించుకుంటున్నామన్న మాట.

అవ్యక్తస్వరం. అంతేకాదు, ఏ కొలదిమందికో భోగాలు సాగవనీ నిత్యనైవేద్యాలు చెల్లవనీ నీ బిడ్డల్నీ, నీ బంధువుల్నీ, నీ ప్రాణాలను చేతులార బలిస్తున్నావు. ఎప్పుడన్నా ఆలోచించుకున్నా? నీ మీద, నీ కుటుంబంమీద ఈ ప్రజలకేమి కోపం? నీవు వారికి చేసిన అపకార మేముంది?

వర్మ. నిజమే. ఇంతవరకు ఈ యుద్ధరంగంలో నాకు శత్రువు ఎదురుపడ లేదు. ఈ ప్రజలు నా కెలాంటి అపకారం చెయ్యలేదు. రాజు చంపమన్నాడు కాబట్టి నేను చంపాలా? అతిఘోరం. అందులో నా మాదిరి గానే వారుకూడా తిండికి వాచి మలమల మాడిపోతూ వుండాలి, లేకపోతే ఇంతగా ప్రాణాలకు తెగించరు. ఈ సంగతి నా కెన్నడూ పాలుపోలేదు. మరెవ్వరూ చెప్పలేదు. ఏదో దూక మంటే దూకటం. నరకమంటే నరకటం తప్ప మరి ఎన్నడూ ఆలోచించ లేదు.

అవ్యక్తస్వరం, అయితే నీవు ఆలోచించుకో లేని యంత్రానివా? ఇంత మందిని నిర్దాక్షిణ్యంగ చంపితే నీకు వచ్చి వళ్ళోపడే దేముంది? లేని స్వర్గం తప్ప.

వర్మ. ఆలోచించుకోటానికి నా కెందు కధికారం లేదు? కేవలం

ఎవరి కోసమో తోడి మానవుణ్ణి ఎందుకు చంపాలి? ఇప్పుడీ ప్రజలు అనుభవిస్తున్న కరవు నా కొడుకురు రాదని ఎలా నమ్మటం? ఏ దేవు డడ్డు పడుతాడు? బాబూ చాల పొరబడ్డాను, క్షమించు.

అవ్యక్తస్వరం. పాపం నీకు మాత్రం నిజం ఎలా తెలుస్తుంది? "ధర్మం పాడై పోతూవుంది. ఉద్ధరించండి. భగవంతుడు మీ వెంట ఉంటాడు. అంత అవసరమైతే అవతారమెత్తి పోరాడుతాడు. చచ్చారా స్వర్గం. గెల్చారా విజయం. ఇదిగో డబ్బు తీసికోండి. తరతరాలుగా మీ వంశాల్ని, మీ భూముల్ని రక్షించుకోండి. పుట్టేవాడు చావటం ఖాయం. కాబట్టి తీసుకుతీసుకు చచ్చేకంటె ధర్మంకోసం, జాతి కోసం, స్వాతంత్ర్యంకోసం పోరాడి మరణించటం మేలు. మీరు చచ్చింతరువాత మా పేర్లు చరిత్రలో సువర్ణాక్షరాలతో వ్రాసు కొంటాము" అని ప్రబోధం సాగిస్తారు. దానికి అనుగుణప్రచారం, ఆర్థికవిధానాలు సాగుతాయి. ఇలాంటి యుద్ధంకోసం పేదలు తిండీ, గుడ్డా మానెయ్యాలి. ఇలాంటి జగత్తులో మెలిగే సామాన్యమానవు డేమనుకుంటాడు.

వర్మ. ఈ ఆటలు ఇక సాగవు. (లేవబోతాడు)

అవ్యక్తస్వరం. లేవకు, లేవకు! తలకాయ ఎగిరిపోతుంది. అబ్బబ్బ ఏమి గుండ్లు!

వర్మ. అయితే పోరాడుకొంటూ పోదాం పద.

(అవ్యక్తస్వరం విషాదంగా నవ్వుతుంది. వర్మ మెల్లగా తల తిప్పి చూస్తాడు.)

వర్మ. అయ్యో, అయ్యో!. కాళ్ళచేతులనుంచి రక్తం ఒకటే ధారగా కారుతూవుందే దెబ్బలు ఎప్పుడు తగిలాయి?

అవ్యక్తస్వరం. (మాట్లాడదు)

వర్మ. ఏమిటీ! ఇందాకటినుంచి ఇలా రక్తం పడియలుకట్టి పారుతూ వుంటే మాట్లాడుతున్నావా?

అవ్యక్తస్వరం. ఆరిపోయే దీపం గప్పా మనదూ ?

వర్మ. ఛీ! అలా అధైర్యపడకూడదు, నిన్నిక్కడినుంచి నేను మోసుక పోతాను.

అవ్యక్తస్వరం. నామూలాన నీ ప్రాణాలను కూడ వదలుకోవలసివస్తుంది. పైగా దీనివల్ల ప్రయోజనంకూడా లేదు. నీవు ఎలాగైనా బయట పడి ప్రజలతో చేయికలుపు.

వర్మ. (శవాలమధ్యనుంచి బయటికి ప్రాకివచ్చి తనతో మాటాడే వ్యక్తి దురవస్థ చూచి స్తంభించిపోతాడు. ఒకటి రెండు సెకండ్లు గడచి పోతాయి.) నిన్నిలా వదలిపెట్టి నేనెలా వెళ్ళేది?

అవ్యక్తస్వరం. నా మాట విను. నా కోసం కూచోటంవల్ల ప్రయోజనం లేదు. నేను బ్రతికికూడ ఏమి ప్రయోజనం ?

వర్మ. ఎందుకలా నిరుత్సాహపడతావు? కాళ్లుచేతులు పోగొట్టుకొన్న ఎందరు యోధులు బ్రతకటం లేదు? పైగా మాలాంటి వాళ్లకు కన్నులువిప్పగలవు.

అవ్యక్తస్వరం. నాసంగతి నీకు తెలీదు. లోకానికి నాహృదయాన్ని ఇవ్వటంకోసం శిల్పిని చిత్రకారుణ్ణి అయ్యాను. ఈ సేవలో ఆనం దాన్ని పొందటానికి అలవాటు పడ్డాను. ఈ ఆనందాన్ని సాధించి పెట్టే చేతులు పోయాయి. లోకానికి సేవచేస్తున్నానని సంతృప్తితో గర్వించే అవకాశాలు పోయాయి. ఇక నేను దేనికోసం ఏ ఆదర్శ నిర్వహణంకోసం జీవించేది? పైగా కొన ఊపిరితో వుండి యోధుల కాళ్లుచేతులకు అడ్డు రావటం తప్ప, వారి ఉత్సాహం కొడికట్ట టానికి తప్ప, మరొక ప్రయోజనం లేదు. అబ్బబ్బ ఇంతవరకు బాధ ఎలాగోఉంది. (వర్మ నిర్విణ్ణుడై చూస్తాడు) ఈ దీనుని తుదికోర్కె చెల్లించు. నీతళతళలాడే పిడిబాకులతో ఒకసారి యీ రొమ్ములో గుచ్చి అలా హాయిగా బయటికి లాగు.

వర్మ. ధర్మంకోసం నిలబడిన యోధుణ్ని—యిలానీచంగా—నేను

పిరికిపందను. నిజంగా పిరికిపందను, బాబూ నావల్ల కాదు.

అవ్యక్తస్వరం. ఇదిగో నామాటవిను. నేను బ్రతకటం వల్ల, ఇలా బాధపడుతూవుంటే నీకు సంతోషమా? నాకు తెలుసు నీది జాలి గుండె. దానిలో కాకోలం లేదు.

వర్మ. (కంగారుగా) లేదు, లేదు—నావల్ల కాదు.

అవ్యక్తస్వరం. నారొమ్ము కత్తికి ఎదురు తిరుగుతుందనా భయం? ఏ మాత్రం సంకోచించకు. నాకోసం ఎదురుచూచే గురుదేవులకు ఏకాంతంగా ఉన్నప్పుడు నా తుది నమస్కారాలు అర్పించు. తన పాత్ర నిర్వహణంలో వేదాద్రి సుఖంగా, శాశ్వతంగా, కన్నులు మూశాడని చెప్పు. తాతయ్యా! ఆలస్యం దేనికి? గురుదేవులైన యువభారతిగారు ఇక్కడి వార్తల కోసం తహతహలాడుతూ వుంటారు. నాలుగువేల రాచసిబ్బంది హతమైందని చెప్పు. నీకు కూడ దీక్ష యివ్వగలిగింది గురువులే. నాకు ఆ తాహతు లేదు. ఇంకా దేనికాలస్యం? తాతయ్యా, తోటి మానవుడు ఇలా నరకయాతన అనుభవిస్తూవుంటే ఎలా సహిస్తావు? నీ ప్రేమబంధాలు ఇంత తీవ్రంగా వుంటే నీవు ప్రజలతో కలసి ఎలా యుద్ధం చేస్తావు? నా మాటలో నీకు గురి వుంది. నన్ని బాధనుంచి విముక్తుణ్ని చెయ్యి. యువభారతి సన్నిధికి వెళ్ళు. అక్కడ ఓ అల్లరిపిల్ల వుంటుంది. పొరపాటుననైనా నామృతి సంగతి ఆ పిల్లకు తెలియజేసేవు సుమా! కానీ తాతయ్యా, నీ శరీరం కొంత పటుత్వం తప్పవచ్చును. కాని నీ హృదయంలో నిశితత్వమూ దీక్షా వెల్లి విరుస్తున్నాయి. కానీ తాతయ్యా, తాతయ్యా!......

వర్మ. (చటుక్కున మొఖం త్రిప్పికొని) యువ భారతికి జై! (పిడి బాకుతో గట్టిగా వేదాద్రి రొమ్ములో గుచ్చుతాడు) యువ భారతికి జై! (పిడిబాకు లాక్కొని ముఖం తిప్పకుండానే మెల్లగా పారాడు కొంటూ వెళ్లుతూ వుంటాడు). [యుగసంధ్య నుంచి]

ఫ్రెంచికామెడీ

పాత్రలు

★

వెంకటేశ్వరన్

మధుకుమార్

రాఘవరావు

★

[గ్రాండ్ హోటల్లో మూడో అంతస్తు గది. ఒక ప్రక్కన స్ప్రింగ్ మంచమూ, దానిమీద మెత్తనిపరుపూ, మీద మల్లెపూవులాగా వున్నదుప్పటీ ఉన్నాయి. ఇంకో ప్రక్కన టేబుల్, కుర్చీ ఉన్నాయి. టేబుల్ మీద హోటలువాళ్లమర్చిన చక్కటి అద్దం, ఫోను, ఒక ఆల్బం తప్ప మరేవీ లేవు. ఇంకో ప్రక్క సోఫా, చుట్టివున్న హోల్డాలు వెళ్లిపోటానికి సిద్ధంగావున్న సూట్‌కేసూ వున్నాయి. సోఫావెనక స్నానాలగది తలుపువుంది.

వెంకయ్య — ఇప్పుడు వెంకటేశ్వరన్ అయ్యాడు — కుర్చీలో కూర్చొని తాను తియ్యబోతున్న 'శైలబాల' అనే చిత్రంలో నటించటానికి దరఖాస్తులు పెట్టుకున్న అభ్యర్థుల ఫోటోల ఆల్బం తిరగవేస్తున్నాడు. మొన్నటిదాక పత్రికల్లో ఏకాంకికలు, కథలూ వ్రాస్తూ వుండేవాడు. కొత్తగా సినిమా కంపెనీ ఒకటి బయలుదేరి, వెంకయ్య వ్రాసిన శైలబాల తియ్యమని, అతన్నే డైరెక్టర్ని చేసింది.

సినిమారంగంలో మొదటినుంచీ నటిస్తున్నవారెవ్వరూ నచ్చలేదు. కొత్తవాళ్లనుంచి మంచి సమర్థుల్ని తీసికోవాలని అభిలాష. ముఖ్యంగా ప్రధానభూమిక నిర్వహించగల చాకచక్యమున్నవాడు కనుపించలేదు. ఆల్బం పేజీలు తిప్పుతూ అభ్యర్థుల భంగిమలుచూచి నవ్వుతూ వుంటాడు.]

వెంకటేశ్వరన్. వహ్వా! ఏం పోజులు, ఏం పోజులు! ఈ అతిరథులూ, మహారథులూ సినిమాలవాళ్ళమీద విరుచుకపడకపోతే, సైన్యంలో చేరగూడదూ? ఆ మిడిగుడ్లు, ఆ రొమ్ము విరుపులూ చూసి జర్మనులు తారెత్తి పారిపోతారుగా! యూరప్‌లో మళ్ళీ, ప్రజాస్వామికం తలెత్తుతుంది. కాదు—కాంగ్రెస్ వద్దంటున్నది; సోషలిస్టులు వ్యతిరేకప్రచారంచేస్తుంటే, ఎలా సైన్యంలో చేరుతారు? ఇక చౌకగా పడివుంది సినిమారంగం! హుఁ.

[టేబిల్ మీద ఫోను మోగుతుంది. వెంకటేశ్వరన్ అందుకొని]

హాల్లో.........ఎవరది.........పత్రికా విలేఖరివా ?.........

ఆఁ కాదూ?......నాకు తీరికలేదు. స్టూడియోకి వెళ్లుతున్నా......

ఆఁ......ఏమిటి?......విలేఖరివా ?......కమిన్ ప్లీజ్.

[వెంకటేశ్వరన్ లేచి, కుర్చీ తిప్పుకొని, వాకిలివంక చూస్తూ వుంటాడు.

ఐదు సెకండ్లు గడిచింతరువాత గదితలుపు మెల్లగా తెరుచుకుంటుంది. బిళ్లగోచి, నేల జీరుకాడే కుచ్చిళ్లూ, బెంగాలీలాచ్చీతో సహా మధుకుమార్ ప్రత్యక్షమౌతాడు.]

మధుకుమార్. క్షమించండి !

వెంకటేశ్వరన్. (అనుమానంగా) పత్రికా విలేఖరివా ?

మధుకుమార్. లేదు...కాని—

వెంకటేశ్వరన్. ఇప్పుడు మీతో మాట్లాడజాలనందుకు క్షమించాలి.

మధుకుమార్. రెండే ముక్కలు మాట్లాడుదామని వచ్చాను.

వెంకటేశ్వరన్. అర్జంటుగా గది ఖాళీ చెయ్యాలి,...ఇంకా బోలెడు పనుంది...క్షణం తీరిక లేదు.

మధుకుమార్. రెండేమాటలు... నేను.

వెంకటేశ్వరన్. ప్రయోజనం లేదు...మరెప్పుడన్నా.

మధుకుమార్. (తలుపు ఓరగిలవేస్తాడు. వెంకటేశ్వరన్ అనుమానంగా చూస్తాడు.) తీరిక లేకపోయినా తప్పేదికాదు... నేను—

వెంకటేశ్వరన్. ఏమిటి ఈ దౌర్జన్యం ?

మధుకుమార్. ఎమన్నా అనండి, (తలుపుగడి మెల్లగా వేస్తాడు. వెంకటేశ్వరన్ కొంత గాభరా పడతాడు.) వినక తప్పదు. మా నాన్న పెద్ద స్థితిమంతుడు.

వెంకటేశ్వరన్. (చిరాకుగా) ఈ సొంత గోడంతా నా కెందుకయ్యా ?

మధుకుమార్. (లక్ష్యపెట్టకుండానే) నేను కథకుణ్ణి, నాటికలు

వ్రాస్తాను. పైగా కమ్యూనిస్టుని.

వెంకటేశ్వరన్. (భయంతో) ఆఁ!

మధుకుమార్. కమ్యూనిస్టు రాక్షసుడు-కాదు లెండి; వాడూ మానవుడే. అందువల్ల మా నాన్న ఇంట్లోనుంచి వెళ్లగొట్టాడు.

వెంకటేశ్వరన్. నేను వెళ్లాలి. చెప్పి ఫలం లేదు.

మధుకుమార్. నాకు మరో జీవనాధారం లేదు. నా కథల్లోను, నాటికల్లోను జీవించాలని వ్రాసినవన్నీ పత్రికలవాళ్లకే పంపించాను. నా ప్రతిభ వారికి అర్థం కాలేదు. నావందరచనల్లో ఏదో పనికిరాని దాన్ని ఏరి ప్రకటించారు. అయినా, ఎర్రని ఏగానీ అన్నా నాకు చూపించలా. కవి ఎలా బ్రతకాలి?

వెంకటేశ్వరన్. (ఎలాగా తప్పించుకోవడమని ఆలోచిస్తున్నవాడు చప్పున పర్సుతీసి, ఐదురూపాయలనోటు ఇయ్యబోతాడు).

మధుకుమార్. (కోపంగా) తోటి కవిని గౌరవించేది ఇలాగే నన్నమాట! నేను అడుక్కునేవాణ్ణనుకున్నారా? కవులే యిలా ప్రవర్తిస్తే, పామరలోకం అనాదరభావం చూపించిందంటే విపరీతమేముంది? కవికీ, కళాపిపాసువుకీ ఈ లోకంలో స్థానం లేదు. వీళ్లెందుకు జన్మిస్తారు? భూభారంకోసం కామాలు! (నిట్టూరు విడుస్తాడు.)

వెంకటేశ్వరన్. (నొచ్చుకొని) మీరిలా భావిస్తారనుకోలేదు. I am sorry to offend you.

మధుకుమార్. (లాల్చీ జేబులోనుంచి పిస్టలు తీస్తాడు. ప్రాణాలెక్కడ ఎగిరిపోతాయోనని వెంకటేశ్వరన్ ఆపాదమస్తకం వణకిపోతాడు.) ఎందుకలా వణకిపోతారు? భయపడకండి, మిమ్మల్ని చంపి సాధించేదేముంది? ఇదిగో, యీ పిస్టలు చూచారూ, ఎంత అందంగా వుందో! ఒకేసారి ఐదుగుళ్లు పడతాయి. డబ్బున్నరోజుల్లో 500 పోసి కొన్నా. (వెంకటేశ్వరన్ ముఖంలోకి చూస్తాడు.) ఈ మీట నొక్కితే క్రింద

వాడి చెవిని బడకుండా పంచప్రాణాలు అలా లేచిపోతాయి. ఈ పిస్టల్ చాలా మంచిది లేండి, మోస్ట్ అప్ టు డేట్. (తన కణతకు గురిచేసి పెట్టుకుంటాడు. వెంకటేశ్వరన్ ఒళ్లంతా చెమటముద్ద అవుతుంది. కళవళ పడతాడు, ఏమీ తోచదు. వెఱ్ఱిచూపులు చూస్తాడు.)

వెంకటేశ్వరన్. అంతపనికి పూనుకోవద్దు. వద్దు, వద్దు, నా మాట వినండి !

మధుకుమార్. ఇంకా గెందుకు ఈ ప్రపంచంలో బ్రతకటం? మీ లాంటివారికి గుదిబండగా ఎందుకు బ్రతకాలి? ఒక్కసారి ఈ మీట నొక్కితే సరిపోతుంది.

వెంకటేశ్వరన్. (భయంతో కుర్చీలోనుంచి లేవకుండానే) ఈ అఘాయిత్యానికి పూనుకోకండి. బ్రతికి ఏదన్నా సాధించవచ్చును గాని, చచ్చి ఏం చేస్తారు? లోకం ఇలాగ ఉంటుంది. ఇక ముందు కూడామీవంటి కవులు ఆత్మహత్య చేసికోవలసిందే.

మధుకుమార్. (అలక్ష్యపు నవ్వుతో) బ్రతికితే ఈలోకం మరీ భయంకరంగాకనిపిస్తుంది. దివారాత్రులులేని మహానరక కూపంలాగా వుంటుంది....... గత్యంతరం లేదు. (వెంకటేశ్వరన్ ముఖంలోకి చూస్తాడు.)

వెంకటేశ్వరన్. మీ మాట మీదేకాని...

మధుకుమార్. లేదు లేండి. అన్నంలేక, పేరులేక మలమల మాడి చావటంకన్న యిదే మేలు.

వెంకటేశ్వరన్. మేలా? ఆత్మహత్యకంటే మరో మహాపాతకంలేదు.

మధుకుమార్. అలాకాదు. ఈ పిస్టలుతో కాల్చుకుని చస్తాననుకోండి... మీరొక చక్కని నాటికను వ్రాయవచ్చును. మంచి చిత్రాన్ని తియ్యొచ్చు. ప్రజల హృదయం కరిగిపోతుంది, నా విషాదగాథ లోకానికి విశదమౌతుంది. నా జీవితచరిత్ర కోసం లోకం తహతహ పడు

తుంది. పత్రికా కార్యాలయాల్లో మూలబడి మూలుగుతున్న రచనలు మళ్ళీ సూర్యరశ్మిని చూస్తాయి. నా పేరు, మీ పేరు, సాహిత్యచరిత్రలో సువర్ణాక్షరాలతో ఎక్కుతాయి—ఇక గత్యంతరంలేదు. (మీట నొక్కబోతాడు, వెంకటేశ్వరన్ గభాలున లేచి మధుకుమారు చేయిపట్టుకుంటాడు. అతని కాళ్ళు వణకుతూనే వుంటాయి)

వెంకటేశ్వరన్. ఆగండి, ఆగండి,

మధుకుమార్. ఆగటంలేదు, గీగటంలేదు.

వెంకటేశ్వరన్. నేను చెప్పేదివిన్న తరువాత...మీ పిస్టల్ 500 ఇచ్చి నేను కొంటాను. నేను భిక్షం వేస్తున్నట్టు కాదుగా? మీ పిస్టల్ మీ రమ్ముకోవచ్చును. ఇందులో తప్పేముంది? హృదయం నొచ్చుకోవలసిన పని కూడా ఉండదు.

మధుకుమార్. మీరుకొంటే యేమైనట్లు?

వెంకటేశ్వరన్. ఏమీలేదు. 500 తో ఎటులేదన్నా పదినెల్లు గడుస్తాయి. ఈ లోగా స్థితిగతులు చక్కబడవచ్చును. మీ రచనల్లోని రసాన్ని లోకం ఆస్వాదించవచ్చును.

మధుకుమార్. లోకం నా రచల్ని ఆనందించినంత మాత్రాన్నే డబ్బిస్తుందా? ప్రయోజనంలేదు, వట్టి అడియాస. ఈ ఊహాసౌధంలో నాహృదయాన్ని నిలిపి తలక్రిందులు చెయ్యకండి.

వెంకటేశ్వరన్. నాలాగానే మీరు సినిమా డైరెక్టర్లు కావచ్చును. లేక మీ తండ్రిగారే మీకు ఆస్తీ పాస్తీ అప్పగించవచ్చును. నా మాట వినండి!

మధుకుమార్. ఇవన్నీ కేవలం మధుర స్వప్నాలు.

వెంకటేశ్వరన్. ఆశలు కోసివేసుకొని ఎలా బ్రతకటం?

మధుకుమార్. అసలు ఎందుకు బ్రతకటం?

వెంకటేశ్వరన్. పుట్టేటప్పుడే యీ తెలివి తేటలుంటే?

మధుకుమార్. నా పుట్టుక నా చేతిలో వుందా?

వెంకటేశ్వరన్. నీపుట్టుక నీచేతిలో లేనప్పుడు, నీచావును నీచేతిలోకి లాక్కొచ్చే అధికారం మాత్రం ఉంది కామాలు! పిచ్చిపోకలు పోక, నామాట వినండి. ఈ 500 తీసుకోండి. (పర్సులోనుంచి ఐదు నోట్లు తీసి మధుకుమార్ చేతిలో పెడతాడు. అతడు సందేహిస్తాడు.] సందేహం దేనికి?

మధుకుమార్. ఏమో, నాకిష్టంలేదు. మంచిరోజులు ముందున్నాయని మోహా పెడుతున్నారు.

వెంకటేశ్వరన్. ఎల్లకాలం రాత్రే ఉంటుందా? ఈ పదినెల్లూ గడవనీండి. అంతగా దారీతెన్నూ కనుపించకపోతే, ఇప్పటిదారి అప్పటికుండనే వుంటుందిగా.

మధుకుమార్. మీ కిచ్చివేసిన పిస్టలు నాకు అప్పుడెలా వస్తుంది? ఏమో, ఇదంతా వట్టిభ్రమ. లేనిపోని ఆశల్ని రెక్కొలుపుతున్నారు.

వెంకటేశ్వరన్. మిమ్మల్ని మోసగిస్తే నాకు ఒరిగే దేముంది? ఇలాంటి ఇబ్బందులు అందరికీ వస్తూనే వుంటాయి. కష్టాలు రాగానే ఇంతటి పనికి పూనుకో గూడదు. ఇది కష్టాలనుంచి గట్టెక్కటం కాదు. కష్టాలకు నీచంగా లొంగిపోవటమౌతుంది. నామాట వినండి.

మధుకుమార్. (నిట్టూర్పు విడుస్తూ) మీలాంటివారు చెప్పటం, నాలాంటివాడు కాదనటం బాగుండదు. కాని...

వెంకటేశ్వరన్. కానీలేదు, అర్ధణాలేదు. మా పిస్టలివ్వండి. (మధుకుమార్ చేతిలోని పిస్టల్ తీసికొంటాడు.)

మధుకుమార్. సరే, మీ రెక్కడికో పోవాలని త్వరపడుతున్నారు. ఇంతసేపు ఆపినందుకు క్షమించండి. ఇక సెలవు తీసుకుంటాను.

వెంకటేశ్వరన్. మంచిది.

(గడియ తీసి, తలుపు తెరచుకొని మధుకుమార్ నమస్కారంచేసి వెళ్లిపోతాడు. వెంకటేశ్వరన్ తలమీది కొండను దించినట్లై, నిట్టూర్పు విడుస్తాడు. తుడుచుకొంటున్నా చెమట ఆగటం లేదు. క్షుభితవాలకం

ఇంకా చక్కబడలేదు. మూడు నాలుగు నిమిషాలు గడుస్తాయి.

ఇంతలో నిండుసూట్‌తో రాఘవరావు సూట్‌కేసు పట్టుకొని, గది లోకి చరచరా వస్తాడు. తలవని తలంపుగా వెంకటేశ్వరన్‌ను చూచి ఆశ్చర్యపోతాడు.)

రాఘవరావు. నువ్వా! ఈ గదిలో వుంటున్నావా? ప్రొప్రైటరు నీ గది నాకెలా ఇచ్చాడు?

వెంకటేశ్వరన్. నేను ఖాళీ చేస్తానని చెప్పాను, అందువల్ల నీ కిచ్చి వుంటాడు.

రాఘవరావు. (సూట్‌కేసు ఒక ప్రక్కన పెట్టి) బాత్‌రూమ్ ఎక్కడ? ఏమిటి అలా వున్నావు?

వెంకటేశ్వరన్. చాలా వుందిలే భాగవతం. కాస్తలో తప్పిపోయింది ఆత్మహత్య.

రాఘవరావు. (ఆతురతతో) నువ్వేనా? ఆ బూర్జువారోగం నీకూడా అంటుకుందా?

వెంకటేశ్వరన్. నేనా? ఎందుకు ఆత్మహత్య చేసుకోవాలి? సుఖంగా బ్రతకలేకనా?

రాఘవరావు. అమెరికాలో అందుకనే ఆత్మహత్య చేసుకొంటారు. ఇంతకూ సంగతేమిటి?

వెంకటేశ్వరన్. ఎవడోవచ్చి, నాగదిలో చచ్చిపోతానన్నాడు. వాడిదగ్గర పిస్టల్ కొని ప్రాణాలతో పంపించేటప్పటికి తల ప్రాణం తోక కొచ్చింది.

రాఘవరావు. (ఆశ్చర్యపడుతూ) వాడా, ఆ పిస్టల్ ఏజంటు... నీకూడా ఒకటి అంటగట్టాడూ?

వెంకటేశ్వరన్. ఏమిటీ, ఏమిటి! వాడు ఏజెంటా? పిస్టల్ ఏజంటు? దొంగవెధవ, నాకూ టోపీ వేశాడన్నమాట? ఇలాంటి వెధవల్ని ప్రభుత్వం వూరక చూస్తూ వుంటుందన్నమాట. వాడితాడు తెంచక

ఊరుకుంటానా ? కాస్తా కూస్తా కాదు, ఐదు వందలు ...(ఫోను తియ్యబోతాడు.)

రాఘవరావు. ఇప్పు డేంచేదామని ?

వెంకటేశ్వరన్. పోలీసుకి ఫోనుచేసి, పట్టించి, మోసం చేశాడని కేసు పెడతాను.

రాఘవరావు. ఇష్టపూర్వకంగా నివ్వే డబ్బిచ్చి పిస్టల్ తీసుకొన్నావు. వాడు కొనమనికూడా నిన్నడగలేదు. కేసుపెట్టి ప్రయోజనం లేదు.

వెంకటేశ్వరన్. ఇలాంటి నేరాలు జరుగవలసినవే నన్నమాట ! వీణ్ణి ఏంచేస్తే పాపం తిరుతుంది ?

[ఫోను మోగుతుంది]

రాఘవరావు. వాడే నట్లుంది.

వెంకటేశ్వరన్. మళ్లీ ఇక్కడి కెందుకొస్తాడు ?

రాఘవరావు. ఈ గది ఇప్పుడు నాకింద వుందిగా. నీవు ఇంకా ఇక్కడే వున్నావని వాడి కెలా తెలుసు ?

వెంకటేశ్వరన్. వాణ్ణి పట్టుకు తీరాలి.

రాఘవరావు. ఆగు. (ఇంకా మోగుతున్న ఫోను తీసుకుని మాటాడవద్దని) హల్లో......ఎవరది (వెంకటేశ్వరన్‌తో) వాడే, నేను చెప్పలా ? (ఫోన్లో) ఆఁ, రావచ్చును. (ఫోను స్టాండులోపెట్టి) వస్తున్నాడు. నీవు ఇక్కడ వుండకూడదు. త్వరగా పోవాలి వస్తూ వుంటాడు.

వెంకటేశ్వరన్. ఎక్కడ దాక్కోమంటావు ? మంచంకింద దూరమంటావా ? ఎంతగతి పట్టింది ! (దూరబోతాడు.)

రాఘవరావు. (గబగబా తలుపు గడియవేసి వచ్చి) ఇది కన్యాశుల్క కాదు. బాత్ రూంలోకి వెళ్లు. (వెళ్లుతూ వుంటాడు. పిస్టల్ బల్ల మీద ఉంటుంది. రాఘవరావు చూస్తాడు.) ఏడిసినట్టే ఉంది. దీన్ని కూడా తీసికెళ్లు.

వెంకటేశ్వరన్. పెట్టే, హోల్డాలు గుర్తుపట్టడూ ?

రాఘవరావు. అదిగో వస్తున్నట్లుంది. కాలి చప్పుడు వినపడుతూ వుంది. నీవు త్వరగా పో, నేను చూస్తానులే.

(వెంకటేశ్వరన్ పిస్టలుతో స్నానాలగదిలోకి వెళ్లి, తలుపు మూస్తాడు. రాఘవరావు ముక్కుతూ అంతపెట్టి, హోల్డాలు మంచం కిందికి కనబడకుండా నెట్టి, కోటువిడిచి మంచంమీద విసిరేస్తాడు. త్వరగాపోయి గడియతీసి తలుపు తెరవకుండా వచ్చి సోఫాలో కూర్చొని వెంటతెచ్చుకున్న పత్రిక చూస్తూ ఉన్నట్టు నటిస్తాడు. ఇంతలో గదితలుపు తట్టిన చప్పుడౌతుంది.)

రాఘవరావు. కమిన్.

మధుకుమార్. (తలుపు తెరుచుకొని వస్తాడు.) తమతో ఐదు నిమిషాలు మాట్లాడుదామని వచ్చాను.

రాఘవరావు. ఐదు కాకపోతే పదినిమిషాలు మాట్లాడండి.

మధుకుమార్. నేను ఉన్నకుటుంబంలో పుట్టాను. కథలు, నాటికలు వ్రాశాను. కమ్యూనిష్టుని. అందువల్ల మా నాన్న యింట్లోనుంచి వెళ్లగొట్టాడు.

రాఘవరావు. అంతమాత్రాన్నే వెళ్లగొట్టడం దేనికి?

మధుకుమార్. ఆయన వార్ కమిటీ ప్రెసిడెంటు. నేను వ్యతిరేక ప్రచారం చేసేవాణ్ణి. అందువల్ల తన కొంప మునిగిపోతుందని వెళ్లగొట్టాడు.

రాఘవరావు. వెళ్లగొడితే?—ఇప్పుడా సంగతంతా నా కెందుకు?

మధుకుమార్. వినండి. నాకు మొదటినుంచీ కథలూ, నాటికలూ వ్రాసే అలవాటు. నా రచనల్ని పత్రికలు కాని, లోకం కాని ఆదరించ లేదు.

రాఘుపరావు. నిజమే, నీ కథలంటేనేకాదు, సాహిత్యమంటేనే లోకంలో ఆదరణ లేకుండా పోయింది.

మధుకుమార్. నా కథను ప్రకటించిన వాడైనా దమ్మిడీ యివ్వడు.

జీవితం దుర్భరమై పోయింది.

రాఘవరావు. నాకు కూడా ఇలాంటి అనుభవమే. నేనూ ఇరవై నవలలు వ్రాశాను. ఒక దానికి కాకపోతే, ఒకదానికైనా దమ్మిడీ రాలేదు. నా సొమ్మంతా అచ్చువాళ్ళ ఎదాన పోశాను.

మధుకుమార్. (ఆశ్చర్యపడి తలుపు గడియ వేసివచ్చి, జేబులోనుంచి పిస్టల్ తీస్తాడు. రాఘవరావు వణుకుతున్నట్లు నటిస్తూ,)

రాఘవరావు. అదెందుకు ?

మధుకుమార్. భయపడకండి, మిమ్మల్ని కాల్చబోవటం లేదు. ఇలాంటి దుర్భరజీవితంకంటె మరణం మేలు. కాల్చుకుని చచ్చిపోతాను.

రాఘవరావు. బలే ఊహ ! ఇలాంటి దరిద్రలోకంలో ఉండి ప్రయోజనం లేదు. మన కెందుకులే అని మనవంటి వాళ్లు ఊరుకోబట్టే ఇలా జరుగుతూవుంది. ప్రతిభావంతు లంతా మలమల మాడి చస్తున్నారు. అలా తిండిలేక మాడి చావటంకంటె ఇలా చావటమే మంచిది. లేకపోతే, లోకానికి గుణపాఠం చెప్పలేము. ఎంతమంచి ఊహ తట్టింది మీకు !

(మధుకుమార్ దిగ్భ్రమ చెందుతాడు. తెల్లబోయి, కొంత తెప్పరిల్లుతాడు. నోటివెంట మాటరాదు.)

రాఘవరావు. ఎందు కాలస్యం ?

మధుకుమార్. కాని...

రాఘవరావు. నిజమే, ఇలాంటి చోట చచ్చి ఎవడి గొంతుకో ఉరి తేవటం కంటె, చాటుగా చస్తే బాగానే వుంటుంది. అయినా మించిపోయింది లేదు. ఈ కాగితంమీద ఆత్మహత్య చేసికొంటున్నానని రాసి, కాల్చుకోండి, ఎంత సేపో పట్టదు. ఇట్లా నీచత్వంపాలు కావడంకంటె మీ ఉపాయమే బాగుంది. ఇంకా సందేహం దేనికి ?

మధుకుమార్. దీంట్లో గుళ్లు లేవు.

(స్నానాలగది తలుపు తెరచుకొని వెంకటేశ్వరన్ గబగబా వస్తాడు.)

వెంకటేశ్వరన్. అయితే నా పిస్టల్లో గుళ్లున్నాయి. ఒకటి తప్పినా, ఇంకా నాలుగుంటాయి. పక్కవాడిక్కూడా వినిపించదు. ఏం అలా చూస్తావు ?

(మధుకుమార్ తెల్లబోయి చేతులు నలుపుకుంటూ వుంటాడు)

రాఘవరావు. ఎట్లాగైతేనేం, నేటికి దొరికిపోయావు. ఏమిటి నీ కథ ?

వెంకటేశ్వరన్. ఈ మోసమంతా యేమిటి ?

(కన్నంలో తేలుకుట్టిన దొంగలాగ మధుకుమార్ మాట్లాడడు. అతని చూపులు క్రిందికి ప్రసరిస్తుంటాయి. కాలిబొటన వ్రేలు నేలను గీరుతూ వుంటుంది. రాఘవరావు వెంకటేశ్వర్లను ఒకళ్ళనొకళ్ళని చూచుకుంటారు. నాలుగైదు సెకండ్లు గడుస్తాయి. మధుకుమార్ స్థితి రాఘవరావులో జాలిని రేకెత్తిస్తుంది. ఈ దుస్సహప్రశాంతాన్ని భగ్నం చేస్తూ.)

రాఘవరావు. (వెంకటేశ్వరన్‌తో) నీ శైలబాలలో నాయకపాత్ర వేయటానికి ఒకడు కావాలంటివి కాదూ ?

మధుకుమార్. (సంతోషంతో వెంకటేశ్వరన్ వైపు తిరిగి) అట్లైతే నన్ను బుక్ చేసికోండి. ఈ వెధవవృత్తి వదిలేసి, హాయిగా బ్రతుకుతాను. దయవుంచండి.

వెంకటేశ్వరన్. నువ్వు పనికివస్తావని ఎట్లా చెప్పేది ? కెమేరాకు పనికి వచ్చేదీ లేనిదీ చూడవద్దా ?

రాఘవరావు. (నవ్వుతూ) మోసగించాడని కంటుగా ఉన్నట్లుంది.

వెంకటేశ్వరన్. నాకెందుకు కంటు?

రాఘవరావు. అయితే యితన్ని బుక్ చెయ్యి?

వెంకటేశ్వరన్. బాగా నటించగలడో లేదో?

రాఘవరావు. నీ వంటివాణ్ణి నాటకమాడి నమ్మించి 500 పుచ్చుకోవడంకంటె ఎలాంటి నేర్పు కావాలి?

మధుకుమార్. (వెంకటేశ్వరన్‌తో) అనుగ్రహించి ఒక నటకుణ్ణి పోషించండి.

వెంకటేశ్వరన్. సరే.

మార్చి 1941.

Printed at Renaissance Printers Ltd., Thyagaraya Nagar, Madras.

రష్యా విప్లవం	1	4	0
ప్రపంచకథలు			
1-వ భాగము	1	0	0
2-వ భాగము	1	0	0
పరివర్తనం	1	0	0
కావ్యజగత్తు	1	0	0
జఘనసుందరి	1	0	0
యుగసంధ్య	0	12	0
డమడమాల బండి	1	0	0

జాకొబిన్ పబ్లికేషన్, తెనాలి.

Renaissance Printers Ltd., Thygaraya Nagar, Madras.